PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 92 | విజయవాడ, సోమవారం 4 నవంబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 4 November 2024 | Rs

ఇజ్రాయిల్‌కు బుద్ధి చెబుతాం

- ఎప్పుడు అనేది సైన్యం నిర్ణయిస్తుంది :ఇరాన్
- అదే జరిగితే ఇజ్రాయిల్‌ను ఆపలేం: అమెరికా

5

కివీస్ క్లీన్ స్వీప్

- సొంతగడ్డపై భారత్ ఘోర పరాజయం
- మూడో టెస్టులో 25 పరుగులతో కివీస్ గెలుపు

6

ఉప్పు భూములపై కార్పొరేట్ కన్ను

- తీర ప్రాంతానికి మరో ముప్పు
- ఇప్పటికే పూర్తయిన డ్రోన్ సర్వే

ప్రజాశక్తి - అమరావతి

కృష్ణపట్నం పోర్టు విస్తరణ కోసం సముద్రపు ఒడ్డునే ఉన్న 775 ఎకరాల ఉప్పు భూములను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అదాని గ్రూపు కోరింది. ఆ సంస్థకు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కొద్ది రోజుల క్రితం కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు నిజానికి కృష్ణపట్నం తీరంలోని ఈ భూముల పై పోర్టు యాజమాన్యం కన్ను ఇప్పటిది కాదు!

ఇక్కడే కాదు. దేశ వ్యాప్తంగా తీర ప్రాంతంలో ఉన్న ఉప్పు భూములను తమకు అప్పగించాలని కార్పొరేట్ యాజమాన్యాలు ఎప్పటి నుండో కోరుతున్నాయి. పర్యావరణ పరంగా సున్నితమైన ఈ భూములను ప్రైవేటు సంస్థలకు కేటాయించకూడదని నిబంధనలు స్పష్టంగా ఉండటంతో వాటి ప్రయత్నాలు ఫలించలేదు. వరుసగా మూడవసారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆ నిబంధనలను మార్చివేసింది. ఉప్పు భూములను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ గుట్టుచప్పుడు కాకుండా కొద్దిరోజుల క్రితం సర్క్యులర్ జారీ చేసింది. వెంటనే కార్పొరేట్ డేగలు ఆ భూములను ఎగరేసుకుపోవడానికి సిద్ధమయ్యాయి. దేశ ఆర్థిక రాజధాని ముంబాయిలోని ఉప్పు భూములపై తొలివేటు పడింది. బిజెపి భాగస్వామ్యంతో నడిచే ఆ రాష్ట్ర ప్రభుత్వం అదాని సంస్థకు ఆ భూమిని అప్పగించింది. దేశంలోనే అతిపెద్ద మురికివాడగా గుర్తింపు పొందిన 'ధారవి'లో పునరుద్ధరణ ప్రాజెక్టులో భాగంగా పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చే పేరిట ఈ పందేరాన్ని పర్యావరణ వేత్తలు, రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తున్నా అక్కడి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ముంబాయి తరువాత ఆంధ్రప్రదేశ్‌లోని ఉప్పు

శ్రీకాకుళం జిల్లా నౌపడలో ఉప్పు భూములు

భూములను స్వాధీనం చేసుకోవడంపై అదాని సంస్థ దృష్టి సారించింది.

ఎంత విస్తీర్ణం...?

దేశ వ్యాప్తంగా 59,768 ఎకరాల్లో ఉప్పు భూములు ఉన్నాయి. వీటిలో అత్యధికం 20, 716 ఎకరాలు ఉన్న ఘనత మన రాష్ట్రానిదే! మన రాష్ట్రం తరువాత తమిళనాడు, మహారాష్ట్రలు ఉన్నాయి. ఆహారంలో అత్యంత కీలకమైన ఉప్పు ఈ భూముల్లోనే సాగవుతుంవటం, పర్యావరణ పరంగా అత్యంత కీలకం కావడంతో ఈ భూములను మొదటి నుండి కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంచారు. కేంద్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక అధికారులను, సిబ్బందిని నియమించి ఈ భూముల పరిరక్షణతో పాటు, ఉప్పు తయారీని పర్యవేక్షించేది. దేశంలో సరళీకరణ ఆర్థిక విధానాలు ప్రారంభమైన కార్పొరేట్ సంస్థల కన్ను ఈ భూములపై పడింది.

నిబంధనల్లో మార్పులు ఇలా...

ఉప్పు తయారీకి ఇతర అవసరాలకు ఈ భూములను వినియోగించ కూడదన్న నిబంధన చాలా సంవత్సరాల పాటు కొనసాగింది. అయితే, ముంబాయితో పాటు మరికొన్ని ప్రాంతాలో ప్రజావసరాల కోసం ఈ భూమిని వినియోగించుకోవాలన్న విజ్ఞప్తిని అనేక ప్రభుత్వ సంస్థలే చేశాయి. ఈ నేపథ్యంలో 2012వ సంవత్సరంలో మొట్టమొదటి సారి ఈ నిబంధనలను మార్చారు. అప్పుడు కూడా ప్రైవేటు సంస్థలకు ఎటువంటి పరిస్థితుల్లోనూ ఈ భూములు అప్పగించకూడదని స్పష్టంగా పేర్కొన్నారు. అదే సమయంలో పర్యావరణ అంశాలను, నిబంధనలను ఖచ్చితంగా పాటించి తీరాలని నిర్దేశించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో కూడా తొలుత కేంద్ర ప్రభుత్వశాఖలకు, ఆ తరువాత కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు, చివరగా రాష్ట్ర ప్రభుత్వశాఖలకు, సంస్థలకు కేటాయించాలని నిబంధనల్లో పేర్కొన్నారు. ఈ భూములు పొందే సంస్థలు ఉప్పుతయారీకి ప్రత్యామ్నాయ భూమిని చూపించడంతో పాటు, మార్కెట్ విలువ కూడా చెల్లించాల్సిఉంటుంది. ఈ ఏడాది ఆగస్టులో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశం అనంతరం ఈ నిబందనలను మరింతగా దిగజార్చారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, వాటి ఆధీనంలోని వివిధ సంస్థలు ఆన్‌లైన్‌లో వేలంలో భూములను తీసుకోవడానికి ముందుకు రాకపోతే, ప్రైవేటు సంస్థలను అనుమతించవచ్చు.' అని తాజా నిబంధనల్లో పేర్కొ న్నారు. అదే విధంగా ఈ భూములను దక్కించుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ

మిగతా 2లో

దేశ వ్యాప్తంగా ఉప్పు భూముల లెక్కలు (31.12.2023 నాటికి, ఎకరాల్లో)

క్రమ సంఖ్య	రాష్ట్రం	ఉప్పు ఉత్పత్తయ్యే భూమి	ఉప్పు ఉత్పత్తి కాని భూమి	మొత్తం
1.	ఆంధ్రప్రదేశ్	18,003	2,713	20,716
2.	తమిళనాడు	14,017	3,078	17,095
3.	మహారాష్ట్ర	2,503	159	12,662
4.	ఒడిషా	4,227	2,492	6,719
5.	గుజరాత్	1,857	25	1,882
6.	ఇతర రాష్ట్రాలు	602	92	694
	మొత్తం	**51,209**	**8,559**	**59,768**

విద్యార్థి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో విద్యార్థి శ్యామలరావు ఫైల్)

హాస్టల్ విద్యార్థి ఆకస్మిక మృతి

- మంత్రి సవిత విచారం

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

విజయనగరంలోని కాటవీధిలోగల బిసి వసతిగృహ విద్యార్థి కొణతాల శ్యామలరావు (12) ఆకస్మికంగా మృతి చెందాడు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం చిల్లపేటరాజాం గ్రామానికి చెందిన ఆ విద్యార్థి కస్పా ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఆదివారం ఉదయం వసతిగృహంలో ఉన్న సమయంలో కళ్లు తిరుగుతున్నాయంటూ కింద పడిపోయాడు. దీంతో, హాస్టల్ వార్డెన్ జానకిరాం ఆ విద్యార్థిని జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక కారణాలు తెలుస్తాయని చెప్పారు. పోస్టుమార్టం అనంతరం విద్యార్థి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సమాచారం తెలుసుకున్న విద్యార్థి కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించారు. శ్యామలరావు చిన్నప్పుడే తల్లి మరణించారు. తండ్రి ప్రయివేటు కంపెనీలో కార్మికుడు. బిసి సంక్షేమ శాఖ జిల్లా అధికారి పెంటోజీరావు, ఎబిసిడబ్ల్యుఒ యశోదనరావు ఆస్పత్రికి వచ్చి వార్డెన్‌తో మాట్లాడారు. విద్యార్థి మృతిపై బిసి సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనకు కారణాలపై తక్షణమే నివేదిక అందజేయాలని బిసి సంక్షేమ శాఖాధికారులను ఆదేశించారు. గుండెపోటుతో మృతి చెంది ఉండొచ్చనే అనుమానాలు వైద్యులు వ్యక్తం చేశారని తెలిపారు. విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

24 గంటల్లో నివేదిక ఇవ్వాలి : రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

బిసి వసతిగృహ విద్యార్థి మృతి విషయం తెలుసుకున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు.. ఆస్పత్రికి వచ్చారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. సంఘటనపై 24 గంటల్లో నివేదిక ఇవ్వాలని బిసి సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.

రూ.25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి : ఎస్ఎఫ్ఐ

బిసి వసతిగృహం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు ఆదివారం సాయంత్రం నిరసన కార్యక్రమం చేపట్టారు. మరణించిన విద్యార్థి కుటుంబానికి రూ.25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్.వెంకటేష్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ సమీరా, జిల్లా సహాయ కార్యదర్శి శిరీషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థి మరణానికి హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యమే ప్రధాన కారణమని, వార్డెన్ జానకిరాం గతంలోనూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆగ్రహించారు. వెంటనే వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

అమెరికా అధ్యక్ష ఎన్నికలు

రేపే తుది సమరం

- పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు
- విజేత ఎవరో తేలడానికి సుదీర్ఘ నిరీక్షణ

వాషింగ్టన్: ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన, శక్తివంతమైన దేశంలో అధ్యక్ష ఎన్నికల తుది ఘట్టానికి రంగం సిద్ధమైంది. ఇప్పటికే 7 కోట్ల మంది అమెరికన్లు వివిధ ఓటింగ్ కేంద్రాల్లో ముందస్తుగా ఓటు వేశారు. కీలకమైన తుది ఓటింగ్ మంగళవారం (నవంబరు5) జరగనుంది. అయితే విజేత ఎవరో తేలడానికి రోజులు పట్టవచ్చు. ఏడు స్వింగ్ స్టేట్స్‌కు గాను ఆరింటిలో ట్రంప్‌దే పైచేయిగా ఉన్నట్లు అట్లాస్ తాజా పోల్ సర్వే పేర్కొనగా, ఇద్దరి మధ్యచాలా గట్టి పోటీ నెలకొన్నట్లు న్యూయార్క్‌టైమ్స్ సర్వే పేర్కొంది. తుది ఓటింగ్‌కు మరో 24 గంటల్లో తెర లేవనుండడంతో కమలా హారిస్ (డెమొక్రాటిక్ పార్టీ), డొనాల్డ్ ట్రంప్ (రిపబ్లికన్ పార్టీ) మధ్య మాటల యుద్ధం పతాక స్థాయికి చేరింది. ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో మాటల తూటాలు పేల్చుతూ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నారు. కీలకమైన సమస్యలను ఎజెండాపైకి రానీయకుండా వ్యక్తిగత ధూషణలు, ఊక దంపుడు ఉపన్యాసాలతో ప్రచారాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ఎలక్టొరల్ కాలేజీలో అత్యధిక ఎలక్టొర్స్ కలిగిన రాష్ట్రాల్లో ఒకటైన పెన్సిల్వేనియాలో ప్యూర్టోరికన్లపై ఆదివారం నాటి ఎన్నికల ర్యాలీలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు హారిస్‌కు ఆయాచిత వరంగా పరిణమించాయి. ప్యూర్టోరికో చెత్త దీవి అని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు పెన్సిల్వేనియాలో ఆయన విజయావకాశాలను దెబ్బతీసేలా ఉన్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ప్యూర్టోరికన్లు ఆగ్రహంగా ఉన్నారు. దీనిని సొమ్ము చేసుకోవడానికి హారిస్ యత్నిస్తున్నారు. జాతి దురహంకారం, విద్వేష రాజకీయాలకు పెట్టింది పేరు ట్రంప్ అని ఆమె దుయ్యబట్టారు. తాజాగా నిర్వహించిన ఓ ఒపీనియన్ పోల్‌లో హారిస్‌కు అమెరికన్ల మద్దతు 44 శాతం నుండి 43 శాతానికి తగ్గినట్లు వెల్లడించింది. దీంతో ఈ సారి ఎన్నికల ఫలితాన్ని జార్జియా, మిచిగాన్ వంటి ఏడు స్వింగ్ రాష్ట్రాలు నిర్ణయించనున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. హారిస్ తన దృష్టంతా ఇప్పుడు మిచిగాన్ పై కేంద్రీకరించారు. ఇజ్రాయిల్‌కు అమెరికా మద్దతు తెలపడాన్ని అరబ్ అమెరికన్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అరబ్ అమెరికన్లు ఎక్కువగా ఉన్న రాష్ట్రం ఇదే. పాలస్తీనీయులను ఊచకోత కోస్తున్న ఇజ్రాయిల్‌కు గత సంవత్సర కాలంలో అమెరికా 380 కోట్ల డాలర్ల మిలిటరీ సాయాన్ని అందజేసింది. ట్రంప్ కూడా ఇజ్రాయిల్‌ను పూర్తిగా వెనకేసుకొస్తున్నారు. ఈ విషయంలో ట్రంప్, హారిస్‌ల మధ్య తేడా ఏమీ లేదు. అలాగే కార్పొరేట్ పన్ను తగ్గించే విషయంలో డెమొక్రాటిక్స్‌కి, రిపబ్లికన్స్‌కి మధ్య ఎలాంటి పేచీ లేదు. జాన్‌ఎఫ్ కెనడీ, ఐషెన్ హోవర్ కాలంలో 90 శాతంగా ఉన్న కార్పొరేట్ టాక్స్ నేడు 21 శాతానికి కుదించబడిందంటే దీనికి ఈ రెండు పార్టీలే కారణం. విదేశీ వలస కార్మికులు, కష్టజీవుల విషయంలో ట్రంప్ చాలా క్రూరమైన వైఖరి తీసుకున్నారు. ఈసారి తాను గెలిస్తే ఎలాంటి సరైన పత్రాలు లేకుండా దేశంలో ఉంటున్న 2 కోట్ల మంది విదేశీయులను గెంటివేస్తానని బాహాటంగా చెబుతున్నారు. హారిస్ దీనికి ప్రత్యామ్నాయం ఏమిటో చెప్పకుండా ట్రంప్ రేసిస్టు, విద్వేషి అని విమర్శించడానికే పరిమితమవు తున్నారు. ఈ రెండు ప్రధాన

మిగతా 2లో

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరుగా లక్ష్మీశా

- కడప జిల్లాకు శ్రీధర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్‌టిఆర్, కడప జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లను నియమించింది. ఇందుకు సంబంధించిన జిఒ 1884ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదివారం విడుదల చేశారు. ఎపి మెడికల్ సర్వీస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిఎంఎస్ఐడిసి) ఎమ్‌డిగా పనిచేస్తున్న జి లక్ష్మీశాను ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరుగా నియమించింది. పరిశ్రమలశాఖ డైరెక్టరు చేరుకూరి శ్రీధర్‌ను కడప జిల్లా కలెక్టరుగా నియమించింది. ఎపిఐఐసి ఎమ్‌డి అభిషిక్త్ కిషోర్‌కు పరిశ్రమలశాఖ డైరెక్టరుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఎపిఎంఎస్ఐడిసి, ఎన్‌టిఆర్ వైద్యసేవ సిఇఒ పోస్టుల నియామకానికి సంబంధించిన బాధ్యతలను వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ప్రభుత్వం అప్పగించింది.

యురేనియం తవ్వకాలొద్దు

- అనుమతులు రద్దు చేయాలి
- ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కర్నూలు జిల్లా, కప్పట్రాళ్లలో యురేనియం తవ్వకాలకు అనుమతులు రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం లేఖ రాశారు. యురేనియం తవ్వకాలకు 68 బోర్లకు కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చిందని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. శనివారం పరిసర 12 గ్రామాల నుంచి ప్రజలు పార్టీలకతీతంగా జెఎసి ఆధ్వర్యాన ధర్నాలు చేశారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి అనుమతులు రద్దు చేయాలని కోరారు. యురేనియం వల్ల కలిగే నష్టం అపారమని, ప్రపంచ ప్రమాద ఘటనలు అనుభవాలుగా ఉన్నాయని వివరించారు. యురేనియం తవ్వకాలు చేపడితే కాలుష్యంతో ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. పచ్చని పొలాలు బీడువారతాయని, హంద్రీనీవా కాలువల ద్వారా వ్యవసాయం చేసుకుంటున్న రైతుల జీవితాలు అంధకారమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. యురేనియం మైనింగ్ వల్ల చెరువులు, కాలువలు, తాగునీరు కలుషితమవుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాంత భావితరాల ప్రజలు కూడా యురేనియం ప్రభావం వల్ల నష్టపోతారని తెలిపారు. ఏదైనా ప్రమాదం జరిగితే వచ్చే ఉత్పాతం అనూహ్యంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో తవ్వకాల అనుమతులు రద్దు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంలో టిడిపి భాగస్వామి కనుక కేంద్రంతో సంప్రదించి వెంటనే సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నట్లు శ్రీనివాసరావు పేర్కొన్నారు.

సేవ్ కప్పట్రాళ్ల

- యురేనియం తవ్వకాలపై ఆందోళనలు
- రోజురోజుకూ ప్రజల్లో వ్యతిరేకత
- తవ్వకాలను అడ్డుకుంటామని హెచ్చరిక

3

'జమిలి' ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలి

- 'టివికె' పార్టీ డిమాండ్
- నీట్, వక్ఫ్ సవరణలతో సహా పలు అంశాలపై 26 తీర్మానాలు

చెన్నై : 'ఒక దేశం-ఒకే ఎన్నిక' ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని తమిళనటుడు విజయ్ నేతృత్వంలో కొత్తగా ఏర్పడిన తమిళగ వెట్రి కజగం (టివికె) పార్టీ డిమాండ్ చేసింది. వక్ఫ్ సవరణ బిల్లు, నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)లను కూడా అది వ్యతిరేకిం చింది. పార్టీ మొదటి కాన్ఫరెన్స్ విజయవం తంగా నిర్వహించిన నేపథ్యంలో ఆదివారం నాడిక్కడ నిర్వహించిన టివికె కార్యనిర్వాహక మండలి, జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశం వివిధ అంశాలపై 26 తీర్మానాలు ఆమోదించింది. ఈ తీర్మానాల్లో కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని, తమిళనాడులో డిఎంకెను విమర్శించింది.

ఒక దేశం-ఒకే ఎన్నిక ప్రతిపాదనను ముందుకు తెచ్చిన బిజెపిని, ఆ పార్టీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వాన్ని టివికె తీవ్రంగా విమర్శించింది. ప్రమాదకరమైన ఈ ప్రతిపాదనను అది వెనక్కి తీసుకోవాలని ఆ తీర్మానంలో డిమాండ్ చేసింది. సమావేశం అనంతరం టివికె పార్టీ అధ్యక్షుడు విజయ్ మీడియాతో మాట్లాడుతూ, ఒక దేశం-ఒకే ఎన్నిక అనేది ప్రజాస్వామ్యం, ఫెడరలిజం సూత్రాలకు విరుద్ధమని విమర్శించారు. ప్రజాస్వామ్య రక్షణకు తమ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా మరో తీర్మానం చేశారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ సమీక్షలో ఉన్న వక్ఫ్ సవరణ బిల్లు-2024ను 'సమాఖ్య వ్యవస్థపై దాడి'గా తీర్మానం పేర్కొంది. ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరింది.

నీట్‌కు వ్యతిరేకంగా చేసిన తీర్మానంలో 'రాష్ట్ర స్వయంప్రతిపత్తి విధానం మా డిమాండ్, దీని ప్రకారం విద్య రాష్ట్ర జాబితాలోకి వస్తుంది. రాష్ట్ర జాబితాలోకి విద్యను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తే, రాష్ట్ర ప్రభుత్వం తనకు తానుగానే నీట్‌ను రద్దు చేయగలదు' అని పేర్కొన్నారు. విద్యను రాష్ట్ర జాబితాలోకి మార్చడానికి కేంద్ర ప్రభుత్వం అడ్డంకులను సృష్టించడాన్ని టివికె కార్యనిర్వాహక కమిటీ వ్యతిరేకిస్తుందని, తప్పుడు వాగ్దానాలతో తమిళనాడు ప్రజలను మోసం చేయడాన్ని కూడా వ్యతిరేకిస్తుందని తీర్మానంలో పేర్కొన్నారు.

టివికె పార్టీ సిద్ధాంతాలు, విధానాలను పూర్తి హృదయపూర్వకంగానూ, బలంగానూ అనుసరించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ప్రస్తుత డిఎంకె ప్రభుత్వ పాలనలో తమిళనాడులో శాంతి భద్రతలు క్షీణించాయని సమావేశం ఆరోపించింది. ఈ మేరకు మరో తీర్మానాన్ని ఆమోదించారు.

హర్యానాలో డిఎపి సంక్షోభం

- రోడ్డెక్కుతున్న రైతన్నలు

5

నేడు టెట్ ఫలితాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు సోమవారం విడుదల కానున్నాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ ఫలితాలను విడుదల చేయనున్నారు. ఎక్స్ ద్వారా టెట్ ఫలితాలను ఉదయం 11:30 గంటలకు విడుదల చేయనున్నారు. 16,347 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయనుంది. అక్టోబర్ 3 నుంచి 21 వరకు ఆన్‌లైన్‌లో జరిగిన టెట్ పరీక్షకు 4.7 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 17 రోజులపాటు రోజుకు రెండు విడతలుగా ఈ పరీక్షలు నిర్వహించారు. డిఎస్‌సిలో 20 శాతం వెయిటేజీ కూడా ఉంటుంది. ఈ టెట్ స్కోర్‌కు లైఫ్‌లాంగ్ వ్యాలిడిటీ ఉంటుంది. అభ్యర్థులు టెట్ ఫలితాలను https://aptet.apcfss.in/ వెబ్‌సైట్ ద్వారా చెక్ చేసుకోవచ్చు. అలాగే డిఎస్‌సి నోటిఫికేషన్ ఈ నెల 6న విడుదల చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.

మళ్లీ డయేరియా విజృంభణ

- ఎరుకొండలో ఒకే రోజు 14 కేసులు నమోదు
- ఆందోళనలో గ్రామస్తులు

ప్రజాశక్తి- పూసపాటిరేగ(విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం ఎరుకొండ గ్రామంలో డయేరియా అదుపులోకి రాలేదు. తగ్గుముఖం పట్టిందనుకుంటున్న సమయంలో మళ్లీ విజృంభించింది. ఆదివారం ఒకేసారి 14 కేసులు నమోదయ్యాయి. బాధితుల్లో ఎనిమిది మందిని పూసపాటిరేగ పిహెచ్‌సికి తరలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆరుగురికి చికిత్స అందిస్తున్నారు.. విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాల పరిశీలకులు గ్రామంలో సర్వే చేశారు. ప్రస్తుతం డయేరియా బారిన పడిన వారంతా సురక్షితంగానే ఉన్నారని వైద్యులు వెల్లడించారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేయించి, ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

అంతుచిక్కని కారణాలు

విజయనగరం జిల్లాలో తొలుత గుర్ల మండల కేంద్రంలో మూడు వారాల క్రితం డయేరియా కోరలు చాచింది. పది మంది మృతి చెందారు. అనంతరం పూసపాటిరేగ మండలంలోని నడిపల్లిలో డయేరియా ప్రబలింది. అక్కడ కాస్త తగ్గుముఖం పట్టిందని ప్రజలు, వైద్యులు ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో ఎరుకొండపై డయేరియా విరుచుకుపడింది. ఇప్పటికే ఈ గ్రామానికి చెందిన ఒకరు డయేరియాతో చనిపోయారు. ప్రస్తుతం సుమారు 25 మంది వైద్యం పొందుతున్నారు. మండలంలోని నడిపల్లి, ఎరుకొండ గ్రామాల్లో డయేరియా వల్ల ఇప్పటి సుమారు 50 మంది అనారోగ్యానికి గురికావడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి డయేరియా తగ్గుముఖం పట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

ఎమ్మెల్యే మాధవి పరామర్శ

ఎరుకొండలో డయేరియా బాధితులను నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి పరామర్శించారు. డయేరియా మళ్లీ ప్రబలడానికి కారణాలపై ఆరా తీశారు. రిపోర్టులు సోమవారానికి వస్తాయని అధికారులు చెప్పారు. ప్రస్తుతం తాగునీరు, పారిశుధ్యం సక్రమంగా ఉందని, ఆహారం కలుషితమై ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

గత ఐదేళ్లూ తీవ్ర సంక్షోభంలో రాష్ట్రం

- జయప్రకాశ్ నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గత ఐదేళ్ల రాష్ట్రం తీవ్ర సంక్షోభంలో ఉందని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాశ్ నారాయణ పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.9.41 లక్షల కోట్లు అప్పు ఉందని, రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో సగం వడ్డీలు కట్టేందుకే సరిపోతుందన్నారు. విజయవాడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఏ రాష్ట్రానికి ఇంత అప్పు లేదన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గందరగోళంలోకి నెట్టేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్ల మరమ్మతులను పట్టించుకున్న దాఖలాల్లేవన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కబెట్టే శక్తి సిఎం చంద్రబాబుకే ఉందన్నారు. రాజధానిగా అమరావతి అభివృద్ధి చెందాల్సిన అవసరముందని, దేశ, రాష్ట్ర భవిష్యత్తును కాపాడేలా నేతలు చర్యలు తీసుకోవాలని జయప్రకాశ్ నారాయణ పేర్కొన్నారు.

నేడు కలెక్టరేట్ల వద్ద ధర్నా యథాతథం

- ఎపి విఆర్ఎల సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని విఆర్ఎలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నవంబరు 4న కలెక్టరేట్ల వద్ద ధర్నా కార్యక్రమంతోపాటు యథావిధిగా సామూహిక రాయభారాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పేర్కొంది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధర్నా కార్యక్రమం వాయిదా పడినట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. విఆర్ఎలపై ప్రభుత్వం మోపిన నిబంధనలకు విరుద్ధమైన డ్యూటీలు రద్దు చేయాలని, తెలంగాణలో అమలవుతున్న విధంగా పేస్కేలు జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హులైన విఆర్ఎలకు విఆర్ఒ, అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ ఖాళీ పోస్టుల్లో నియామకాలు చేయాలన్నారు. నామినీలను విఆర్ఎలుగా గుర్తించాలని చేస్తున్న కార్యక్రమానికి పెద్దయెత్తున విఆర్ఎలు హాజరై జయప్రదం చేయాలని ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు.

అమెరికా అధ్యక్ష ఎన్నికలు రేపే తుది సమరం

(మొదటిపేజీ తరువాయి)

పార్టీలకు పూర్తి భిన్నంగా, పీపుల్స్ అజెండాతో అమెరికన్ కమ్యూనిస్టు పార్టీ ఎన్నికల్లో పాల్గొంటున్నది. 'మాగా' (ఎంఎజిఎ- మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) నినాదంతో ముందుకొస్తున్న ఫాసిస్టు ట్రంప్‌ను ఓడించేందుకు కార్మిక, ప్రగతిశీల శక్తులను కలుపుకుని వీలైనంత విశాల ఐక్యత సాధించేందుకు కమ్యూనిస్టు పార్టీ కృషి చేస్తోంది. కొన్ని రాష్ట్రాల్లో అణగారిన వర్గాలకు ఓటు వినియోగించుకునే హక్కు తిరస్కరించబడుతున్నందున వారి ఓటు వేసే హక్కును కాపాడతామని, కార్మిక హక్కులను పరి రక్షించడం, పేద, ధనికుల మధ్య విపరీతంగా పెరిగిపోయిన అంతరాలను తొలగిస్తామని, పునరుత్పత్తి హక్కు పరిరక్షిస్తామని, టెస్లా, నెట్ ఫ్లిక్స్, జనరల్ ఎలక్ట్రికల్స్, టెస్లా వంటి గుత్త సంస్థల పై కార్పొరేట్ పన్ను పెంచుతామని, తద్వారా సమకూరిన ఆదాయాన్ని అందరికీ విద్య, వైద్యం, గృహవసతి కల్పించేందుకు వినియోగిస్తామని కమ్యూనిస్టు పార్టీ తన ఎజెండాలో పేర్కొంది. అంతేకాదు, క్యూబాపై దశాబ్దాలుగా అమెరికా సాగిస్తున్న ఆర్థిక దిగ్బంధనాన్ని ఎత్తివేస్తామని, యూదు దురహంకార ఇజ్రాయిల్‌కు అన్ని రకాల సాయాన్ని నిలిపివేస్తామని, శాశ్వత కాల్పుల విరమణకు కృషి చేస్తామని కమ్యూనిస్టు పార్టీ తెలిపింది. పచ్చి మితవాది ట్రంప్‌ను ఓడించేందుకు శాయశక్తులా కృషి చేయాలని కమ్యూనిస్టు పార్టీ తన శ్రేణులకు పిలుపునిచ్చింది.

26న కేంద్రానికి హెచ్చరిక అర్జీలు

- రైతు, కార్మిక సంఘాల పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న అర్జీలతో కూడిన హెచ్చరికలు జారీ చేయాలని రైతు, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. రైతు, కార్మిక సంఘాల రాష్ట్ర నాయకుల జాయింట్ కమిటీ సమావేశం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎపి రైతు సంఘాల సమన్వయ కమిటీ సభ్యులు వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. మూడోసారి అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వం తన విధానాలను ఏమాత్రం మార్చుకోలేదన్నారు. దేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడం లేదని, ఏడాది పాటు రైతుల ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయలేదని అన్నారు. రైతులు పండిస్తున్న అన్ని పంటలకూ కనీస మద్దతు ధర చెల్లించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతులకు ఒక్కసారైనా రుణమాఫీ చేయాలని కోరినా పట్టించుకోకుండా, కార్పొరేట్ సంస్థలకు మాత్రం భారీ మొత్తంలో రూ.14.65 లక్షల కోట్లు రుణమాఫీ చేసిందన్నారు. కేరళలో అమలవుతున్న పంట రుణ ఉపశమన చట్టాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేయాలని కోరారు. రాష్ట్రాల పరిధిలో ఉన్న సహకార రంగాన్ని కేంద్రం అజమాయిషీలోకి తీసుకునేందుకు కొత్త చట్టం తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్మికుల హక్కులకు భంగం కలిగేలా 42 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా 4 లేబర్ కోడ్‌లను రూపొందించినట్లు చెప్పారు. గిరిజనులకు నష్టదాయకమైన అటవీ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. పాడి పరిశ్రమ రంగంలో పాల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో కార్పొరేట్‌లకు అనుకూలంగా మూడు నల్ల చట్టాలను తీసుకొస్తే, రైతుల పోరాట ఫలితంగా పార్లమెంట్‌లో ఆమోదం పొందలేదన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించకుండా సిఎం చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. జాతీయ రైతు, కార్మిక సంఘాల పిలుపు మేరకు రాష్ట్రంలోనూ రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, వివిధ రంగాలకు చెందిన కార్మికులందరూ పెద్దయెత్తున అర్జీలతో కేంద్రానికి ఈ నెల 26న హెచ్చరికలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు యు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు సాధ్యం కాని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాయన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటున్నారే తప్ప కార్మికుల ప్రయోజనాలపై నోరు మెదపడం లేదన్నారు. 1926 నుంచి పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసే అధికారం ఈ ప్రభుత్వాలకు లేదన్నారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని ఆమోదించిన నవంబరు 26న ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగానికి వ్యతిరేకంగా అనుసరిస్తున్న విధానాలపై అర్జీలను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె పోలారి, రైతు సంఘాల రాష్ట్ర నాయకులు వై కేశవరావు, జి ఈశ్వర్, పి జమలయ్య, మరీదు ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సుధాకర్ చౌదరి కుమార్తె వివాహానికి చంద్రబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా మంగళగిరి సికె కన్వెన్షన్‌లో ఆదివారం జరిగిన పారిశ్రామికవేత్త సుధాకర్ చౌదరి కుమార్తె శ్రీకేయూర వివాహానికి సిఎం చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు.

సనాతన ధర్మ పరిరక్షణకు ప్రత్యేక విభాగం

- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రకటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మళ్లీ సనాతన ధర్మం పల్లవి అందుకున్నారు. ఇప్పుడు ఏకంగా సనాతన ధర్మ పరిరక్షణ కోసం జనసేన పార్టీ ఆధ్వర్యాన 'నరసింహ వారాహి గణం' పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఏలూరు జిల్లా పర్యటనలో భాగంగా లక్ష్మీనరసింహుని పాదాల చెంత ఈ విభాగం ఏర్పాటు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తాను అన్ని మతాలనూ గౌరవిస్తానని, తన సొంతమతమైన హిందూ మతాన్ని అనుసరిస్తానని అన్నారు. సనాతన ధర్మాన్ని తిడుతూ, ఇష్టానుసారం సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేవారిపైనా తగిన చర్యలుంటాయన్నారు. సనాతన ధర్మం గురించి మాట్లాడితే కొందరు విమర్శిస్తున్నారన్నారు. తాను నమ్మే ధర్మానికి తప్పు జరిగితే మాట్లాడటం కూడా తప్పేనని కొందరు అనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తాను ధర్మం పట్ల నిర్భయంగా మాట్లాడతానని, దానికి విఘాతం కలిగితే స్పందించడం కనీస ధర్మమన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు ఇబ్బంది కలుగుతుంటే చూస్తూ ఉండలేమని, అక్కడి హిందువులు ఊచకోతకు గురవుతున్నా స్పందించవద్దు అంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రతి హిందువుకూ సనాతన ధర్మానికి విఘాతం కలిగితే స్పందించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆలయాలకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, పోలీసు అవుట్ పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఉక్కు కాంట్రాక్టు కార్మికుల ఉపాధి జోలికొస్తే ఆందోళన ఉధృతం : నర్సింగరావు

ప్రజాశక్తి- గాజువాక (విశాఖపట్నం)

ఉక్కు కాంటాక్టు కార్మికుల ఉపాధి జోలికొస్తే ఆందోళన ఉధృతం చేస్తామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ఉక్కు యాజమాన్యాన్ని హెచ్చరించారు. విశాఖ ఉక్కులో పనులు కోల్పోయిన కార్మికులకు ఉపాధి కల్పించాలని, వేతనాలు సకాలంలో చెల్లించాలని, టెండర్లు సకాలంలో పూర్తి చేయాలని, ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని తదితర డిమాండ్లతో ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యాన పాతగాజువాకలో ఆదివారం మహా ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి నర్సింగరావు మాట్లాడుతూ.. ఉక్కు యాజమాన్యం దొడ్డిదారిన కాంట్రాక్టు కార్మికులను తొలగించాలని చూస్తోందని, అందులో భాగంగానే టెండర్లు పిలవటంలేదని తెలిపారు. దీనివల్ల సుమారు 600 మంది కార్మికులు నేడు బయట ఉన్నారని చెప్పారు. ప్లాంట్‌లో పూర్తి స్థాయిలో ఉత్పత్తి తీస్తే సమస్య పరిష్కారం అవుతుంది తప్ప కార్మికులను తగ్గిస్తే కాదని గుర్తించాలన్నారు. ఆరు నెలలుగా జీతాలు లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభావం గాజువాక మార్కెట్‌పై పడిందని తెలిపారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ప్రమాదాన్ని గాజువాక ప్రజలందరిలోకి తీసుకెళ్లాలని కోరారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ఎఐటియుసి నాయకులు డి.ఆదినారాయణ మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికుల పోరాటానికి పర్మినెంటు కార్మికుల మద్దతు ఉంటుందని తెలిపారు. ఐఎన్‌టియుసి నాయకులు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ. కార్మికులను తొలగించడంలేదని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు చెబుతున్నా, ప్లాంట్‌లో జరుగుతున్నది దానికి భిన్నంగా ఉందని తెలిపారు. కార్మికులకు అండగా ఉంటామన్నారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు జి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో నాయకులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ధాన్యం కొనడం లేదని ధర్నా

- కేంద్రం వద్దకు వచ్చి రైతులకు హామీ ఇచ్చిన కలెక్టర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి 15రోజులు అయినా కొనుగోలు చేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో ప్రధాన రహదారిపై ఆదివారం ధర్నా చేశారు. స్పందించిన కలెక్టర్ కేంద్రం వద్దకు వచ్చి రైతులకు హామీ ఇచ్చి ధాన్యం కొనుగోలును ప్రారంభించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పదిర గ్రామంలోని ఐకెపి సెంటర్లలో ధాన్యం పోసి నెల రోజులైనా కొనుగోలు చేయడం లేదని గ్రామ రైతులు కామారెడ్డి - సిరిసిల్ల ప్రధాన రహదారిపై వడ్లు పోసి బైటాయించారు. వడ్లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నాలో పాల్గొన్న మాజీ జెడ్‌పిటిసి చీటి లక్ష్మణ్‌రావుతో అధికారులు ఫోన్‌లో మాట్లాడి ధర్నా విరమింపచేయాలని కోరారు. అయినా రైతులు ఆందోళన కొనసాగింది. సమాచారం అందుకున్న పోలీసులు ధర్నా స్థలానికి చేరుకొని వారితో మాట్లాడి విరమింపచేశారు.

అనంతరం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ స్పందించి పదిర ఐకేపీ సెంటర్‌ను సందర్శించి వెంటనే వడ్లను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి కేంద్రాన్ని ప్రారంభించారు. ధర్నాలో సుమారు 100 మంది పైగా రైతులు పాల్గొన్నారు.

రహదారిపై ధాన్యం పోసి నిరసన తెలుపుతున్న రైతులు

ఇతర మతాల్లోకి మారిన వారికి ఎస్‌సి హోదాపై కమిషన్ పదవీ కాలం పెంపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిక్కు మతం, బౌద్ధమతం కాకుండా ఇతర మతాల్లోకి మారిన వ్యక్తులకు షెడ్యూల్డ్ కులాల (ఎస్‌సి) హోదాను మంజూరు చేయవచ్చో లేదో పరిశీలించడానికి సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన కమిషన్ పదవీకాలాన్ని కేంద్రం ఏడాది పొడిగించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. కమిషన్ తన పనిని వచ్చే ఏడాది అక్టోబరు 10న ముగించాలని నిర్ణయించుకున్నందున, దాని నివేదికను ఖరారు చేయడానికి అదనపు సమయాన్ని కోరిందని నోటిఫికేషన్‌లో కోరింది. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్-1952 ప్రకారం 2022 అక్టోబరు 6న కమిషన్ ఆఫ్ ఎంక్వైరీని ఏర్పాటు చేశారు. ఈ విచారణ సామాజిక న్యాయం, హక్కులు, క్రైస్తవ, ఇస్లాం వంటి ఎస్‌సి వర్గీకరణలో సంప్రదాయకంగా చేర్చబడని మతాల్లోకి మారిన వారికి రిజర్వ్‌డ్ హోదాను పొడిగించడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి కెజి బాలకృష్ణన్ నేతృత్వంలోని కమిషన్, సామాజికవేత్తలు, చరిత్రకారులు, ప్రభావిత వర్గాల ప్రతినిధులతో సహా పలువురితో చర్చలు జరుపుతోందని అధికారులు తెలిపారు.

రంగులరాట్నం విరిగిపడి మహిళ మృతి

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

రంగులరాట్నం విరిగిపడిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం తిరుపతిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతికి చెందిన రెండు వేర్వేరు కుటుంబాలు తిరుపతి సమీపంలోని శిల్పారామానికి వచ్చారు. కుటుంబ సభ్యులు రంగులరాట్నం తిరిగేందుకు ఉత్సాహం చూపడంతో లోకేశ్వరి (25), గౌతమి కలిసి జెయింట్ వీల్ తిరిగేందుకు ఒకే బాక్సులో ఎక్కారు. రంగులరాట్నం వేగంగా తిరుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు వారి ఎక్కిన బాక్సు స్క్రూలు ఊడిపోయాయి. దీంతో బాక్సుతోపాటు ఇద్దరూ దూరంగా విసిరిపడ్డారు. ఈ ప్రమాదంలో లోకేశ్వరి అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలపాలైన గౌతమిని కుటుంబ సభ్యులు ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సంఘటనా స్థలంలో మహిళ మృతదేహం



సెమినార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

కథానిలయం పరిరక్షణ అందరి బాధ్యత

- ఎమ్మెల్యే గొండు శంకర్
- రచయితలకూ ప్రాంతీయతత్వం ఆపాదిస్తున్నారు : మాజీ ఎమ్మెల్సీ శర్మ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కా.రా మాస్టారు మానస పుత్రిక అయిన కథానిలయం పరిరక్షణకు అందరి కృషి అవసరమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం సాహితీ, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కాళీపట్నం రామారావు శత జయంతి కార్యక్రమాన్ని శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ.. కథానిలయాన్ని పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేసి రచనలను ప్రపంచానికి పరిచయం చేయడమే కా.రా మాస్టారుకు మనం ఇచ్చే నివాళులన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని మాట్లాడుతూ.. అక్షరమే దైవంగా భావించిన కా.రా మాస్టారు జీవితం, చేసిన రచనలు ఎన్నటికీ ఆదర్శనీయమన్నారు. జ్ఞానం, విజ్ఞత, విలువలు, ధీరత్వం వంటి సుగుణాలు ఆయన నుంచి నేటి తరం గ్రహించాలని, ఇవి ప్రతి మానవాళికి ఉపయోగపడాలన్నారు. తల్లి వంటి మాతృభాష పరిరక్షణకు, అందులోని రచనలను భావితరాలకు అందించేందుకు కృషి జరగాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ.. ఆంగ్ల మాధ్యమం ప్రభావంతో రచయితలకూ ప్రాంతీయతత్వాన్ని అంటగడుతున్నారని, తెలుగు వారు విడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ.. కా.రా వంటి కథకుడు లేరని, తన జీవిత సార్థకతకు కొన్ని నియమాలను పెట్టుకున్నారని తెలిపారు. కార్యక్రమ అధ్యక్షులు, ప్రముఖ రచయిత చీకటి దివాకర్ మాట్లాడుతూ.. తెలుగు కథకుల్లో మూడు తరాల వారికి ప్రతినిధిగా కా.రా మాస్టారు నిలిచారని తెలిపారు. గోనె సంచులు పట్టుకుని ఊరురా తిరిగి కథలు సేకరించారన్నారు. ముందుగా కా.రా మాస్టారు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సెమినార్‌లో కా.రా మాస్టారు రచనలు, కథలపై రచయితలు, ఉపాధ్యాయులు దుప్పల రవికుమార్, కంచరాన భుజంగరావు, మల్లిపురం జగదీష్, డా.కె.ఉదయ్‌కిరణ్, ఎ.మోహనరావు, బాడాన శ్యామలరావు, బాలసుధాకర మౌళి, చింతాడ తిరుమలరావు, పూజారి దివాకర్ పత్ర సమర్పణ చేశారు. కార్యక్రమంలో విశ్వసాహితీ అధ్యక్షులు పొన్నాడ వరహానర్సింహులు, రాజాం రచయితల వేదిక అధ్యక్షులు గార రంగనాథం, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసు, కా.రా మాస్టారు కుమారుడు కె.సుబ్బారావు, గంద్రేడు గౌరునాయుడు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె మూర్తి పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌లో దగ్ధమవుతున్న లారీ

డీజిల్ నింపుకుంటుండగా లారీకి మంటలు

- తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - రాజానగరం(తూర్పు గోదావరి)

డీజిల్ నింపుకుంటుండగా ఒక్కసారిగా లారీకి మంటలు చెలరేగాయి. బంకు సిబ్బంది అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన ఆదివారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని దివాన్ చెరువు వద్ద చోటు చేసుకుంది. బంకు సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గుజరాత్‌కు చెందిన లారీ విశాఖపట్నంలో లోడు దింపి తిరుగు ప్రయాణంలో తూర్పు గోదావరి జిల్లా దివాన్ చెరువు వద్ద పెట్రోల్ బంక్‌లో డీజిల్ నింపుకునేందుకు ఆగింది. బంకు సిబ్బంది డీజిల్ కొడుతుండగా షార్ట్ సర్క్యూట్ జరిగి లారీ ఇంజన్ నుంచి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది కార్బన్ డై ఆక్సైడ్ సిలిండర్లను ఉపయోగించి మంటలను అదులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఈ లోగా రాజమహేంద్రవరం నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. లారీ దగ్ధం కావడంతో రూ.15 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

ఉప్పు భూములపై కార్పొరేట్ కన్ను

(మొదటిపేజీ తరువాయి)

సంస్థలు ఆ భూములను సబ్‌లీజుకు ఇయ్యవచ్చని నిబంధనల్లో పేర్కొన్నారు. 99 సంవత్సరాల వరకు ఈ సబ్‌లీజుకు కాలపరిమితిని విధించారు. మురికివాడల అభివృద్ధి, బలహీన వర్గాల గృహనిర్మాణం వంటి పథకాల అమలును ఈ సబ్‌లీజుకు ఇవ్వడానికి షరతులుగా విధించినప్పటికీ, ఒకసారి భూములు దక్కించుకున్న తరువాత ఏం జరుగుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తాజాగా మార్గదర్శకాల్లో పర్యావరణ పరిరక్షణ, కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సిఆర్‌జడ్) నిబంధనలు పాటించడం వంటి అంశాల ప్రస్తావనే లేకపోవడం గమనార్హం.

చకచకా కదలిక

కొన్ని సంవత్సరాలుగా ఉప్పు భూముల గురించి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ భూములపై అజమాయిషీ ఉన్న కేంద్ర ప్రభుత్వానికి చందిన సాల్ట్ కమిషన్ ఆఫీసులు అనేక చోట్ల నామమాత్రంగానే పనిచేస్తున్నాయి. కొన్ని చోట్ల ఈ కార్యాలయాలను మూసివేసి సిబ్బందిని వెనక్కి పిలిపించుకున్నారు. అయితే, ఈ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టవచ్చంటూ నిబంధనలు సవరించగానే ప్రభుత్వ శాఖల్లో కదలిక వచ్చింది. దేశ వ్యాప్తంగా ఈ భూముల స్థితిగతులపై సర్వేలు నిర్వహిస్తున్నారు. మన రాష్ట్రంలోనూ ఉప్పు భూములున్న అన్ని ప్రాంతాల్లోనూ డ్రోన్‌ల సహాయంతో సర్వేను ఇప్పటికే పూర్తి చేశారు. భూముల ప్రస్తుత స్థితిగతులకు సంబంధించిన వివరాలను పూర్తి స్థాయిలో సేకరించారు. స్థానికులెవరైనా ఈ భూముల్లో ప్రవేశించి ఉంటే వారిని ఖాళీ చేయించే పనులు కూడా ప్రారంభమయ్యాయి.

పోర్టులకు.. పారిశ్రామిక అవసరాలకు కూడా...

గత ఉత్తర్వుల ప్రకారం కాలుష్యానికి, పర్యావరణ ధ్వంసానికి కారణమయ్యే అన్ని రకాల పనులను ఈ ఉప్పు భూముల్లో నిషేధించారు. తాజా ఉత్తర్వుల్లో కేంద్ర ప్రభుత్వం దానికి భిన్నమైన వైఖరి తీసుకుంది. పోర్టులకు, పోర్టు అనుబంధ కార్యక్రమాలకు కూడా ఈ భూములను కేటాయించవచ్చని పేర్కొంది. అదే విధంగా పారిశామిక అవసరాలకు ఈ భూముల వాడకంపై గతంలో ఉన్న నిషేధాన్ని తొలగించింది. ప్రత్యామ్నాయ ఇంధన ఉత్పత్తులు, ఎకో టూరిజం వంటి అవసరాలకు వినియోగించుకోవడానికి కూడా అనుమతించింది.

ఏమిటి ప్రత్యేకత...?

ఉప్పు భూములు సముద్ర మట్టాన్నికన్నా తక్కువ ఎత్తులో ఉంటాయి. అందువల్ల ఆటుపోట్ల సమయంలో సముద్రపు నీరు ఈ భూములోకి చేరుతుంది. ఈ భూములకు స్పాంజ్ వంటి గుణం వుంటుంది. ఫలితంగా భారీ వర్షాలు, వరదల కారణంగా సముద్రతీరంలో చేరే అదనపు నీటిని ఈ భూములు పీల్చుకుంటాయి. ఇలా పరిసర ప్రాంతాలను మడ అడవుల తరహాలోనే వరదలు, సముద్రపు ఆటుపోట్ల నుండి రక్షణ కల్పిస్తాయి. సాధారణ ప్రాంతాల్లో కనిపించని కొన్ని ప్రత్యేక రకాల పక్షులు, జంతువులు, కీటకాలు ఈ భూముల్లో కనిపిస్తాయి.

ఉప్పు ఉత్పత్తి జిల్లాల వారీగా (2021)

జిల్లా	మెట్రిక్ టన్నులు
శ్రీకాకుళం	7,260
విశాఖపట్నం	11,455
తూ.గోదావరి	3,945
కృష్ణా	1,48,945
ప్రకాశం	79,790
నెల్లూరు	33,930
మొత్తం	**2,85,325**

కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతం

సేవ్ కప్పట్రాళ్ల

- యురేనియం తవ్వకాలపై ఆందోళనలు
- రోజురోజుకూ ప్రజల్లో వ్యతిరేకత
- తవ్వకాలను అడ్డుకుంటామని హెచ్చరిక

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

యురేనియం పేరు చెబితేనే కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల పరిసర గ్రామాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. భూమి పొరల్లోంచి యురేనియం తీయడమంటే మృత్యువును నెత్తికెత్తుకున్నట్లే అని భీతిల్లుతున్నారు. ఇందుకు వ్యతిరేకంగా 'సేవ్ కప్పట్రాళ్ల..యురేనియం తవ్వకాలను ఆపండి..పచ్చని పల్లెను కాపాడండి' అంటూ కప్పట్రాళ్లతో పాటు 12 గ్రామాల ప్రజలు ఆందోళనలకు దిగారు. జెఎసి ఏర్పాటు చేసి ఆందోళనలు ఉధృతం చేస్తున్నారు.

కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కప్పట్రాళ్ల అటవీ ప్రాంతంలో యురేనియం నిల్వల నిగ్గుతేల్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు అటామిక్ మినరల్ డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ (ఎఎండి) 70 బోర్ల తవ్వకాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా అందులో 68 తవ్వకాలకు కేంద్రం అనుమతినిస్తూ గత నెల నోటిఫికేషన్ జారీ చేసింది. ఆదోని రేంజ్ ఫారెస్ట్ సెక్షన్ పరిధిలోని కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్ పరిధిలో 1,170.625 ఎకరాల్లో అటవీ శాఖకు చెందిన భూములు ఉన్నాయి. కౌలుట్లయ్య మలగా పిలిచే ఈ రిజర్వు ఫారెస్ట్ కప్పట్రాళ్ల, పి.కోటకొండ, మాదాపురం, చెల్లెంచెలిమెల, గుండ్లకొండ గ్రామాల మధ్య విస్తరించింది. ఆ కొండపైనే కౌలుట్లయ్యస్వామి ఆలయం ఉంది. 2017 ప్రాంతంలో కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టులో తొమ్మిది చోట్ల బోర్ల తవ్వకాలను జరిపి ఆ ప్రాంతంలో యురేనియం నిక్షేపాలు ఉన్నట్లు నిర్ధారించారు. భూగర్భంలో ఎంత పరిమాణంలో యురేనియం నిల్వలు ఉన్నాయో నిర్ధారించిన తరువాతే తవ్వకాలు జరపాల్సి ఉంటుంది. అందుకు కప్పట్రాళ్ల కేంద్రంగా యురేనియం ఎంత ఉంది? ఎలా ఉంది? ఎంత లోతులో ఉంది? తద్వారా లాభమా.. కారా..? వంటి వివరాలు తెలుసుకునేందుకు 68 బోర్ల డ్రిల్లింగ్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. అటవీ భూముల్లో తవ్వకాలు జరపాలి కాబట్టి పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలి. యుసిఐఎల్ తరఫున అటవీ శాఖకు చెందిన 17 ఎకరాల్లో బోర్ల తవ్వేందుకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ సలహా మండలి ఆమోదం కోసం అటామిక్ మినరల్ డైరెక్టరేట్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ (ఎఎండి) రీజనల్ డైరెక్టర్ ప్రతిపాదనలు పంపారు. ఈ విషయం బయటకు పొక్కకుండా గుట్టుగా కొనసాగించారు. ఇప్పుడు ఈ విషయం తెలిసి ఆయా గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాగైనా యురేనియం తవ్వకాలను అడ్డుకుని తీరుతామని చెబుతున్నారు. శుక్రవారం రిజర్వ్ ఫారెస్టులోని కౌలుట్ల స్వామి దేవాలయం ఆవరణలో కప్పట్రాళ్ల, ఈదుల దేవరబండ, నెల్లిబండ, కోటకొండ, దుప్పనగుర్తి, జిల్లేడు బుడకల, చెల్లెంచెలిమెల, బండపల్లి, బంటుపల్లి, బేతపల్లి గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు పార్టీలకతీతంగా యురేనియం తవ్వకాల వ్యతిరేక కమిటీ (జెఎసి)ని ఏర్పాటు చేశారు. శనివారం 12 గ్రామాల ప్రజలు కర్నూలు - బళ్లారి రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. మహిళలు, పురుషులు మంది డప్పులతో నిరసన తెలిపారు. రాస్తారోకోకు ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి మద్దతు ఇచ్చి రోడ్డుపై బైఠాయించారు. యురేనియం తవ్వకాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని ఆ గ్రామస్తులు చెబుతున్నారు.

రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టిన 12 గ్రామాల ప్రజలు (ఫైల్)

ప్రాణాలు కాపాడాలి

కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్‌లో బోర్ల తవ్వకాలను నిలుపుదల చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలి. తవ్వకాల నిలుపుదలకు ప్రజలందరూ కలిసికట్టుగా పోరాడుతున్నాం. రోజు రోజుకూ ఉద్యమం తీవ్ర రూపం దాలుస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి.

- చెన్నమ నాయుడు, కప్పట్రాళ్ల సర్పంచ్.

ఆందోళన తీవ్రతరం చేస్తాం

యురేనియం తవ్వకాలు నిలుపుదల చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తాం. యురేనియం తవ్వకాలతో ప్రజల జీవన విధానం అస్తవ్యస్తమవుతుంది. పి.కోటకొండ, కప్పట్రాళ్ల గ్రామాల ప్రజలు గతంలో ఫ్యాక్షన్‌తో అట్టుడికిపోయారు. ప్రస్తుతం పచ్చని పొలాలతో, పండ్ల తోటలను అభివృద్ధి చేసుకుని ప్రశాంత జీవనం కొనసాగిస్తున్నారు. యురేనియంతో వాయుకాలుష్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారు.

- మల్లేపల్లి రంగడు, యురేనియం తవ్వకాల వ్యతిరేక కమిటీ.

యురేనియం తవ్వకాలతో అవస్థలు

కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్‌లో తవ్వకాలు చేపడితే కొండ చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు అనారోగ్యానికి గురై తీవ్ర అవస్థలు పడతారు. ప్రభుత్వ పెద్దలు, పాలకులు, అధికారులు, స్పందించి తవ్వకాలు నిలుపుదల చేయాలి.

- లక్ష్మీదేవి, ఎంపిపి, దేవనకొండ.

చిన్నారి తల్లిదండ్రులకు రూ.10లక్షల ఆర్థిక సాయం అందిస్తున్న హోం మంత్రి అనిత

కామాంధుడికి కఠిన శిక్ష : మంత్రి అనిత

- చిన్నారి తల్లిదండ్రులకు పరామర్శ
- రూ.10 లక్షల ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ (తిరుపతి జిల్లా)

శవాలపై రాజకీయం చేసే బుద్ధి వైసిపిదేనని హోం మంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. తిరుపతి జిల్లా వడమాలపేట మండలం అలివేలు మంగాపురంలోని ఎస్‌టి కాలనీలో అఘాయిత్యానికి గురై హత్య చేయబడిన చిన్నారి తల్లిదండ్రులను చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌తో కలిసి ఆమె పరామర్శించారు. చిన్నారి చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించారు. అనంతరం హోం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ.. చిన్నారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని, వారికి సొంత ఇంటిని నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఘటన జరిగిన తరువాత పోలీసులు నిందితుడిని వెంటనే అరెస్ట్ చేశారని, మద్యం మత్తులో నిందితుడు ఈ దారుణానికి ఒడిగట్టాడని తెలిపారు. చిన్నారిని హత్య చేసిన నిందితుడికి కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిన్న పిల్లల మరణాలను వైసిపి రాజకీయం చేయడం బాధాకరమని అన్నారు. ఎక్కడ ఘటన జరిగినా ప్రభుత్వం వెంటనే స్పందిస్తోందని తెలిపారు. చంద్రబాబు ప్రతి ఆడబిడ్డను సొంత బిడ్డగా చూస్తున్నారని, సిఎంను విమర్శించే అర్హత జగన్‌కు లేదన్నారు. వైసిపి హయాంలోని మద్యం ఏరులై పారించిందని, ఇప్పుడు మద్యంపై రోజా చేస్తున్న రాద్ధాంతం హాస్యాస్పదమన్నారు. గంజాయి నిర్మూలనకు గట్టి చర్యలు తీసుకుంటున్నామని, నార్కొటిక్ వింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా

ప్రజాశక్తి - వేంపల్లె (వైఎస్ఆర్ జిల్లా)

వైఎస్ఆర్ జిల్లా వేంపల్లె సమీపంలో ఆదివారం తెల్లవారుజామున గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎలాంటి ప్రమాదమూ జరగకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతపురం నుంచి లక్కిరెడ్డిపల్లెకు హెచ్‌పి గ్యాస్ సిలిండర్లతో లారీ బయలుదేరింది. వేంపల్లె సమీపంలోని ఎస్ఎస్‌ఆర్ కల్యాణ మండపం వద్ద రాగానే ఒక్కసారిగా లారీ డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గ్యాస్ లారీ బోల్తా పడడంతో విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బోల్తా పడిన లారీలో నుంచి ఫుల్ గ్యాస్‌తో ఉన్న సిలిండర్లను చాకచక్యంగా బయటకు తీశారు.

తిరుమల శ్రీవారి ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో నాదెండ్ల మనోహర్

శ్రీవారిని దర్శించుకున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారిని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దర్శించుకున్నారు. ఆదివారం విఐపి ప్రారంభ విరామ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయంలోకి వెళ్లిన మంత్రికి టిటిడి అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వదించారు. అధికారులు శేష వస్త్రం కప్పి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రాష్ట్రంలో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు

- టైటానియం కాంప్లెక్స్ ఏర్పాటుకు సన్నాహాలు
- భోగాపురం - మూలపేట మధ్య కోస్టల్ కారిడార్ : కేంద్ర మంత్రి రామ్మోహన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేసి వలసలను అరికడతామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇసుక నుంచి ముఖ్య ఖనిజాలను వేరుచేసే టైటానియం కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. శ్రీకాకుళంలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇరిగేషన్, ఇండస్ట్రీ ఎన్‌డిఎ ప్రభుత్వం నినాదమన్నారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి అవసరమైన ఆలోచనలతో ముందుకెళ్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా 2025 నాటికి వంశధార ఫేజ్-2ను పూర్తి చేస్తామని చెప్పారు. ఉత్తరాంధ్రలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారని, భోగాపురం ఎయిర్‌పోర్టు, మూలపేట పోర్టును అనుసంధానిస్తూ కోస్టల్ కారిడార్ నిర్మాణానికి డిపిఆర్‌లు రూపొందిస్తున్నామన్నారు. మూలపేట పోర్టు సమీపంలో పది వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ ఉందని, అక్కడ ఫార్మా హబ్, బయోటెక్ హబ్ నిర్మిస్తామని తెలిపారు. రూ.20వేల కోట్ల టర్నోవర్ జరిగేలా బీచ్‌శాండ్ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంసిఎంఇ పార్కు ఏర్పాటు చేసి సూక్ష్మ పరిశ్రమలను ప్రోత్సహిస్తామన్నారు. సమావేశంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు పాల్గొన్నారు.

క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

క్రీడల అభివృద్ధికి పెద్దపీట : కేంద్ర మంత్రి రామ్మోహన్

- శ్రీకాకుళంలో 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ఆరంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళంలో 68వ రాష్ట్ర స్థాయి స్కూలు గేమ్స్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో రెండు రోజులపాటు ఈ పోటీలను నిర్వహించనున్నారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి క్రీడాకారులు తలపడనున్నారు. క్రీడా జ్యోతిని స్పోర్ట్స్ అథారిటీస్ చైర్మన్ ఎ.రవినాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెలిగిలించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించి విజయాలను అందుకోవాలని ఆకాంక్షించారు. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య, డిఎస్‌డిఒ శ్రీధర్, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ది ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్
(గవర్నమెంట్ పార్ట్‌నర్డ్ షెడ్యూల్డ్ బ్యాంక్)
27-29-28, ఎన్.టి.ఆర్. సహకార భవన్, గవర్నర్ పేట, విజయవాడ-520002.
ఫోన్ నెం.0866-2429061
APCOB

బంగారు నగల వేలం నోటీసు

ఈ దిగువ పట్టికలో పేర్కొనబడిన వ్యక్తి మా వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి అప్పు తీసుకొనియున్నారు. సదరు బాకీలు సకాలంలో చెల్లించనందున వాటి బకాయిలు పూర్తిగా చెల్లించి నగలు విడిపించుకొనవలసిందిగా మా వద్ద గల వారి చిరునామాలకు పలుమార్లు నోటీసులు పంపించినాము. సదరు బకాయిలు చెల్లించనందున **తేది.12.11.2024 (మంగళవారం) సాయంత్రం 04.00 గం.లకు మా బ్యాంకు (ప్రధాన కార్యాలయ)** ఆవరణలో మా వద్ద తాకట్టులో ఉన్న బంగారు ఆభరణములను వేలం వేసి బకాయిలను జమచేయబడును. ఇంకనూ ఏమైనా బాకీ మిగిలి ఉన్నయెడల చట్టరీత్యా బాకీదారుల నుండి వసూలు చేయబడును. ఆసక్తి ఉన్న వారు వేలములో పాల్గొనవచ్చును. వేలములో పాల్గొనువారు రూ.10 వేలు (E.M.D) ధరావత్తు సొమ్ము కట్టవలెను. ఎట్టి కారణము చూపకనే వేలమును నిలిపివేయుటకుగాని, వేలములో ఎక్కువ ధరకు పాడిన ధరను (Highest Bid) ఆఫరు తిరస్కరించుటకుగాని సర్వహక్కులు బ్యాంకు వారికి ఉన్నవి. వేలములో వస్తువులు పాడుకున్నవారు నగదు వెంటనే చెల్లించవలెను. మరింత సమాచారం కొరకు AGM (BRCC), APCOB వారిని సంప్రదించగలరు.

చల్లపల్లి బ్రాంచ్

లోన్ ఖాతా నెంలు.	ఖాతాదారుని పేర్లు & చిరునామా	మొత్తము బరువు గ్రా॥లు
110001380769	శ్రీ జి.భాను ప్రకాష్, డి.నెం.12-2025, బందరు రోడ్డు, పార్వతమ్మ రోడ్డు, చల్లపల్లి-521126	16.90 గ్రా॥లు

తేది : 04.11.2024
స్థలము : విజయవాడ
సం/-
అసిస్టెంట్ జనరల్ మేనేజర్

పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలు ఆరంభం

- మూడురోజులపాటు పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్వహణ

ప్రజాశక్తి - సీతానగరం (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం జోగింపేటలోని బి.ఆర్ అంబేద్కర్ బాలుర గురుకులం మైదానంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న 68వ విలువిద్య పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు 13 జిల్లాల క్రీడాకారులు పాల్గొననున్నారు. అండర్ 14,17,19 బాలురు, బాలికల విభాగంలో పోటీలు జరగనున్నాయి. కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తితో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు మాట్లాడుతూ.. విలువిద్య పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం రాష్ట్ర విలు విద్య అధ్యక్షులు చెరుకూరి సత్యనారాయణను సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

చిట్టీల పేరుతో మోసం

- రూ.3 కోట్లు వసూలు చేసి వ్యక్తి పరారీ

ప్రజాశక్తి - చింతలపూడి (ఏలూరు జిల్లా)

ఏలూరు జిల్లా చింతలపూడిలో చిట్టీల పేరుతో ఓ వ్యక్తి ఘరానా మోసానికి పాల్పడ్డాడు. సభ్యుల నుంచి రూ.3 కోట్లు వసూలు చేసి పరారయ్యాడు. దీంతో బాధితులు శనివారం రాత్రి పోలీసులను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. చింతలపూడికి చెందిన సుబ్బారావు గత కొంత కాలంగా చిట్టీల పేరుతో డబ్బులు వసూలు చేస్తూ లావాదేవీలు నడుపుతున్నాడు. మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారితోపాటు చిరువ్యాపారులకు ఆశచూపి వారి నుంచి డబ్బులు వసూలు చేశారు. ఒక్కసారిగా సుబ్బారావు ఆచూకీ లేకపోవడం, ఫోన్ చేసినా అందుబాటులో లేకపోవడంతో బాధితులు ఆందోళన చెందారు. తాము మోసపోయామని గ్రహించి చింతలపూడి పోలీసులను ఆశ్రయించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు కిరణ్ మాట్లాడుతూ రూ.15 లక్షలు చిట్టీ కడుతున్నానని దాదాపుగా పూర్తి కావచ్చిందని తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరాడు. బాధితురాలు ప్రమీల మాట్లాడుతూ చిట్టీ పేరుతో రూ.8 లక్షలు కట్టామని, పండ్లు అమ్ముకుని పోగేసి చిట్టీ కడితే ఇలా మోసం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. మరో బాధితుడు మురళి మాట్లాడుతూ సుబ్బారావు వద్ద రూ.15 లక్షలు చిట్టీ కట్టానని తెలిపాడు. పద్మావతి మాట్లాడుతూ తన భర్త డయాలసిస్ పేషెంట్ అని, డ్వాక్రాలో లోన్ తీసుకుని రూ.5 లక్షల చిట్టీ వేశారని తెలిపారు. చిట్టీ పూర్తయ్యిందని, డబ్బులు అడిగితే ఇస్తానని దాట వేశాడని వాపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కుటుంబరావు కేసు దర్యాప్తు చేపట్టారు.

వాగు ప్రవాహానికి 'దాల్మియా' అడ్డుకట్ట

- దళిత గ్రామాలకు ఇబ్బందులు
- 5న లోకాయుక్త విచారణ !

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప జిల్లాలోని దాల్మియా సిమెంట్ పరిశ్రమ వల్ల సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. క్వారీ పేలుళ్ల కారణంగా విడుదలయ్యే దుమ్మూ ధూళి, రాళ్లూ రప్పల కారణంగా పంటలు నాశనం అవుతున్నాయి. పేలుళ్ల ధాటికి ఇళ్ల బీటలు వారుతున్నాయి. వాగుకు అడ్డుకట్ట వేయడంతో ఫ్యాక్టరీ ఎగువ దళిత గ్రామాల ప్రజలు వారాల పాటు వరద నీటిలో ఉండాల్సి వస్తోంది.

జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండల పరిధిలోని చిన్నకొమ్మెర్లలో 2008లో 2.6 మిలియన్ టన్నుల సామర్థ్యంతో దాల్మియా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటైంది. మైలవరం మండలం ఎగువ ప్రాంతమైన తలమంచిపట్నం పరిసర ప్రాంతాల నుంచి ప్రవహించే వాగు పరిశ్రమ మీదుగా వెళ్తోంది. పరిశ్రమ యాజమాన్యం వాగుకు అడ్డుకట్ట వేసి భారీ ప్రహరీని నిర్మించింది. వరద నీరు వెళ్లడానికి అవకాశం లేకపోవడంతో ఏటా వర్షాకాలంలో దుగ్గనపల్లి, చిన్నకొమ్మెర్ల, నవాబ్‌పేట ప్రాంతాలకు చెందిన వందలాది ఎకరాల వ్యవసాయ భూములు, దుగ్గనపల్లి దళిత కాలనీ పూర్తిగా ముంపునకు గురవుతున్నాయి. గతేడాది దుగ్గనపల్లిలో వరద నీరు మూడు నుంచి ఎనిమిది అడుగుల మేర చేరింది. పది రోజుల పాటు వరద నీటిలో నానుతూనే బతకాల్సి వచ్చింది.దళిత గ్రామాల ముంపు, వాగు ఆక్రమణపై నెలకొన్న వివాదం లోకాయుక్తకు చేరింది. ఎనిమిదేళ్లుగా రెవెన్యూ యంత్రాంగం కుమ్మక్కై తప్పుడు నివేదిక ఇస్తున్న కారణంగా బాధిత గ్రామాలకు న్యాయం చేకూరడం లేదనే విమర్శలు ఉన్నాయి. నవంబర్ ఐదున లోకాయుక్తలో విచారణకు రానున్నట్లు సమాచారం.

దాల్మియా సిమెంట్ పరిశ్రమ

విస్తరణకు సిద్ధం

దాల్మియా సిమెంట్ పరిశ్రమ భారీ విస్తరణకు సిద్ధమైంది. వ్యవసాయ పొలాల భూగర్భంలో సిమెంట్ ఉత్పాదనకు అవసరమైన పోర్టుల్యాండ్ స్టోన్ సేకరణలో భాగంగా భారీ భూసేకరణకు కసరత్తు చేస్తోంది. ఎకరా రూ.21 లక్షలతో కొనుగోలు చేయడానికి బేరసారాలు సాగిస్తోంది. కంపెనీ యాజమాన్యం పొల్యూషన్ బోర్డు క్లోజింగ్ ఆర్డర్‌పై కోర్టును ఆశ్రయించి పరిశ్రమ నిర్వహణకు అనుమతులు తెచ్చుకుందని పరిశ్రమ శాఖ పేర్కొంటోంది.

పొలాలను వదిలేశాం

క్వారీకి సమీపంలో ఒకటిన్నర ఎకరా పొలం ఉంది. ప్రతిరోజూ మధ్యాహ్నం వేళల్లో జరుగుతున్న పేలుళ్ల ధాటికి తమ పొలంలో రాళ్లూ, రప్పలూ పడడంతో పంటలు పండడం లేదు. తమ కొత్త ఇంటికి సైతం బీటలు రావడం ఆందోళన కలిగిస్తోంది.

- మీనగ లక్ష్మీ గోవిందమ్మ, నవాబ్‌పేట, మైలవరం మండలం.

బాధితులకు పర్మినెంట్ ఉద్యోగం ఇవ్వాలి

సిమెంట్ పరిశ్రమ భూ బాధితులకు పరిహారం చెల్లించడంతోపాటు ఇళ్లు నిర్మించి, ఉద్యోగాలు ఇవ్వాలి. మినిమమ్ అండ్ స్కేల్ ప్రకారం రూ.47 వేలు వేతనం చెల్లించాలి. ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకోవాలి.

- బి.మనోహర్, సిమెంట్ పరిశ్రమ కార్మిక సంఘం జిల్లా బాధ్యులు.

ఐక్యంగా ముందుకెళ్దాం..

- వైసిపి శ్రేణులకు అధినాయకత్వం పిలుపు

ప్రజాశక్తి-తిరుపతి బ్యూరో, తిరుపతి సిటి

వైసిపి నాయకులు, కార్యకర్తలు రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా.. ఐకమత్యమే ఆయుధంగా పని చేయాలని కార్యకర్తలకు ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసిపి అధ్యక్షులుగా మాజీ టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆదివారం తిరుపతిలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన భారీ బహిరంగ సభనుద్దేశించి వైసిపి సీనియర్ నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, విజయ సాయిరెడ్డి, వైవి.సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు మాట్లాడారు. జగన్ హయాంలో సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా చేసి చూపించారని, అందుకు తిరుపతి అభివృద్ధే నిదర్శనమని తెలిపారు. పార్టీలకతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. నేడు అందుకు భిన్నంగా చంద్రబాబు పాలన సాగుతోందని విమర్శించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన 130 రోజుల్లో రాష్ట్రంలో 130 మంది మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు జరిగాయన్నారు. చంద్రబాబు తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే జగన్‌పై అరోపణలు చేస్తున్నారని తెలిపారు. గతంలో మదనపల్లిలో ఫైల్ దగ్ధం సందర్భంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఇబ్బందులకు గురి చేశారని, విజయవాడ బుడమేరు వరదలకు జగనే కారణమని చెప్పారని, శ్రీవారి లడ్డూను సైతం తమ రాజకీయాలకు వాడుకుని కోట్లాది మంది భక్తుల మనోభావాలతో అడుకున్నారని, ఇప్పుడు వైజాగ్ భవన నిర్మాణాలపై పడ్డారని విమర్శించారు. ఒక పక్క అద్భుతమైన నిర్మాణాలు అంటూనే, వాటిపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ప్రశ్నించేవారిపై కేసులు, దాడులు చేస్తున్నారని విమర్శించారు. వారి బెదిరింపులకు తలొగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. చంద్రబాబు ఇచ్చిన ఉచిత ఇసుక హామీల్లో ఉచితం కనుమరుగైందన్నారు. చిత్తూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షులుగా పోరాటపటిమ కలిగిన కరుణాకర్‌రెడ్డి బాధ్యతలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మాజీ మంత్రులు ఆర్‌కె రోజా, అంబటి రాంబాబు, మెరుగ నాగార్జున, తిరుపతి ఎంపి గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐఆర్‌తో పాటు 12వ పిఆర్‌సికి నియమించాలి

- బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగులకు మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించడంతో పాటు 12వ పిఆర్‌సికి కమిషనరును తక్షణమే నియమించాలని ప్రభుత్వానికి ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ పలిశెట్టి దామోదరరావు, అసోసియేట్ ఛైర్మన్ ఫణి పేర్రాజు, కోశాధికారి కనపర్తి సంగీతరావు విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని లెనిన్ సెంటర్ రెవెన్యూ భవన్‌లో ఎపి జెఎసి అమరావతి స్టేట్ సెక్రటేరియట్ సమావేశం బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం జరిగింది.

సమావేశానంతరం మీడియాతో బొప్పరాజు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచిందని, ఉద్యోగులకు సంబంధించిన అంశాలపై సిఎం తక్షణమే స్పందిస్తారని ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని తెలిపారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) A Government of India Undertaking | సిండికేట్ Syndicate

మధునగర్ బ్రాంచ్ (1620)
అను కాంప్లెక్స్, మధునగర్, మొగల్‌రాజపురం, విజయవాడ-10. ఫోన్: 0866-2475015.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు:
ఋణగ్రహీత: 1) శ్రీ పవన్ బాగం, తండ్రి: బి. వెంకటేశ్వరరావు, డి.నెం. 5-35, రోడ్డు నెం.12, మధురానగర్, గొల్లగూడెం రోడ్డు, ఖమ్మం, వెంకటేశ్వరపురం, ఖమ్మం-507002. **2) శ్రీ పవన్ బాగం, తండ్రి: బి. వెంకటేశ్వరరావు,** డి.నెం.2-13, మంజరి ఎన్‌క్లేవ్, 2వ అంతస్తు, ఫ్లాట్ నెం. ఎస్.ఎఫ్.1, కంచికర్ల, ఎన్.టి.ఆర్. జిల్లా-521180. **3) శ్రీ పవన్ బాగం, తండ్రి: బి. వెంకటేశ్వరరావు,** డి.నెం.2-13, మంజరి ఎన్‌క్లేవ్, క్రింది అంతస్తు, ఫ్లాట్ నెం. జి.ఎఫ్.1, కంచికచర్ల, ఎన్.టి.ఆర్. జిల్లా-521180. **4) శ్రీ పవన్ బాగం, తండ్రి: బి. వెంకటేశ్వరరావు,** 2101 వైక్స్ కోర్టు ఎపిటి #402, హెర్డన్, విఎ 20170, యు.ఎస్.ఎ.
సహ-ఋణగ్రహీత: 1) శ్రీమతి బాగం శ్రీలక్ష్మి, భర్త: బి. వెంకటేశ్వరరావు, హెచ్.నెం. 2-231/31/2, మధురానగర్ కాలనీ, రోడ్డు నెం.12, గొల్లగూడెం, వెలుగుమట్ల, తెలంగాణ-507318. **2) శ్రీమతి బాగం శ్రీలక్ష్మి, భర్త: బి. వెంకటేశ్వరరావు,** డి.నెం.2-13, మంజరి ఎన్‌క్లేవ్, 2వ అంతస్తు, ఫ్లాట్ నెం. ఎస్.ఎఫ్.1, కంచికచర్ల, ఎన్.టి.ఆర్. జిల్లా-521180, **3) శ్రీమతి బాగం శ్రీలక్ష్మి, భర్త: బి. వెంకటేశ్వరరావు,** డి.నెం.2-13, మంజరి ఎన్‌క్లేవ్, క్రింది అంతస్తు, ఫ్లాట్ నెం. జి.ఎఫ్.1, కంచికచర్ల, ఎన్.టి.ఆర్. జిల్లా-521180.
డియర్ సర్/మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.
మా కెనరా బ్యాంక్, విజయవాడ మధునగర్ బ్రాంచ్ నుండి **శ్రీ పవన్ బాగం, తండ్రి: బి. వెంకటేశ్వరరావు మరియు శ్రీమతి బాగం శ్రీలక్ష్మి, భర్త: బి. వెంకటేశ్వరరావు** పొందిన లోన్/ఋణసౌకర్యాల వివరములు:

లోన్ స్వభావం & అకౌంట్ నెం.	లోన్ మొత్తం & లోన్ తేది	వడ్డీతో కలిపి బకాయి	వడ్డీ రేటు
హౌసింగ్ లోను NRIs అకౌంట్ నెం. 160000659017	రూ. 47,00,000/- తేది: 08.03.2022	రూ. 24,54,129/-	11.20% + Penal Interest
హౌసింగ్ లోను NRIs అకౌంట్ నెం. 160000659414	రూ. 47,00,000/- తేది: 08.03.2022	రూ. 25,22,365/-	11.20% + Penal Interest
హోమ్ లోను సెక్యూర్ అకౌంట్ నెం. 164002062430	రూ. 2,74,750/- తేది: 25.03.2022	రూ. 2,60,643/-	11.50% + Penal Interest
హోమ్ లోను సెక్యూర్ అకౌంట్ నెం. 164002062443	రూ. 2,74,750/- తేది: 25.03.2022	రూ. 2,60,480/-	11.50% + Penal Interest

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ **సదరు ఋణాన్ని తేది 08.10.2024 న నిరర్ధక ఆస్తి (ఎన్.పి.ఎ)గా వర్గీకరించింది.** అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **అకౌంట్ నెం 160000659017 క్రింద రూ. 24,54,129/- (ఇరవై నాలుగు లక్షల యాభై నాలుగు వేల నూట ఇరవై తొమ్మిది రూపాయలు), అకౌంట్ నెం. 160000659414 క్రింద రూ.25,22,365/- (ఇరవై ఐదు లక్షల ఇరవై రెండు వేల మూడు వందల అరవై ఐదు రూపాయలు), అకౌంట్ నెం. 164002062430 క్రింద రూ. 2,60,643/- (రెండు లక్షల అరవై వేల ఆరు వందల నలభై మూడు రూపాయలు), అకౌంట్ నెం. 164002062443 క్రింద రూ. 2,60,480/- (రెండు లక్షల అరవై వేల నాలుగు వందల ఎనభై రూపాయలు)** + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.
SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసును పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

1) షెడ్యూలు-ఎ: ఎన్.టి.ఆర్. జిల్లా, కంచికచర్ల సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్, కంచికచర్ల మండలం, కంచికచర్ల గ్రామ పంచాయితీ, కంచికచర్ల గ్రామం, ఆర్.ఎస్.నెం.497/6, ప్లాట్ నెం.122,123,124, సమీప డోరు నెం. 2-13, మొత్తం విస్తీర్ణం 840 చ॥గ॥ స్థలము. హద్దులు: తూర్పు: పంట కాలువ అ॥ 124.0, దక్షిణం: ప్లాట్ నెం. 125 అ॥.60.0, పడమర: 30 అ॥ వెడల్పు రోడ్డు, అ॥ 124.0, ఉత్తరం: అ॥.33 వెడల్పు రోడ్డు అ॥.62.0, నాలుగు సరిహద్దుల మధ్య 840 చ॥గ॥లు లేదా 702.32 చ॥మీ॥ స్థలములో అవిభక్త ఉమ్మడి వాటా 70 చ॥గ॥ లేదా 58.52 చ॥మీ॥ స్థలము. **షెడ్యూలు-బి:** పైన పేర్కొన్న షెడ్యూలు-ఎ మొత్తం స్థలములో "మంజరి ఎన్‌క్లేవ్" పేరున నిర్మించబడినది. దీనిలో గ్రౌండ్ ఫ్లోర్‌లో **ఫ్లాట్ నెం. జి.ఎఫ్.-1, హద్దులు:** తూర్పు: శూన్యాకాశం, దక్షిణం: శూన్యాకాశం, పడమర: శూన్యాకాశం, ఉత్తరం: ఉమ్మడి వరండా. ఈ హద్దుల మధ్య 1900 చ॥అ॥ ఫ్లాట్ ప్లింత్ ఏరియా, 500 చ॥అ॥ కామన్ ఏరియా, 100 చ॥అ॥ పార్కింగ్ ఏరియా మరియు అన్ని ఈజుమెంటరీ హక్కులతో. **టైటిల్ హోల్డర్ పేరు:** శ్రీ పవన్ బాగం, తండ్రి: బి. వెంకటేశ్వరరావు, అతని తరుపున పవర్ ఆఫ్ అటార్నీ ఏజెంట్: శ్రీమతి బాగం శ్రీలక్ష్మి, భర్త: బి. వెంకటేశ్వరరావు.

2) షెడ్యూలు-ఎ: ఎన్.టి.ఆర్. జిల్లా, కంచికచర్ల సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, కంచికచర్ల మండలం, కంచికచర్ల గ్రామ పంచాయితీ, కంచికచర్ల గ్రామం, ఆర్.ఎస్. నెం.497/6, ప్లాట్ నెం.122,123,124, సమీప డోరు నెం. 2-13, మొత్తం విస్తీర్ణం 840 చ॥గ॥ స్థలము. హద్దులు: తూర్పు: పంట కాలువ అ॥ 124.0, దక్షిణం: ప్లాట్ నెం. 125 అ॥.60.0, పడమర: 30 అ॥ వెడల్పు రోడ్డు, అ॥ 124.0, ఉత్తరం: అ॥.33 వెడల్పు రోడ్డు అ॥.62.0, నాలుగు సరిహద్దుల మధ్య 840 చ॥గ॥లు లేదా 702.32 చ॥మీ॥ స్థలములో అవిభక్త ఉమ్మడి వాటా 70 చ॥గ॥ లేదా 58.52 చ॥మీ॥ స్థలము. **షెడ్యూలు-బి:** పైన పేర్కొన్న షెడ్యూలు-ఎ మొత్తం స్థలములో "మంజరి ఎన్‌క్లేవ్" పేరున నిర్మించబడినది దీనిలో రెండవ అంతస్తులో **ఫ్లాట్ నెం. ఎస్.ఎఫ్.-1. హద్దులు:** తూర్పు: శూన్యాకాశం, దక్షిణం: మెట్లు మరియు ఉమ్మడి వరండా, పడమర : శూన్యాకాశం, ఉత్తరం: శూన్యాకాశం. నాలుగు సరిహద్దుల మధ్య 1900 చ॥అ॥ ఫ్లాట్ ప్లింత్ ఏరియా, 500 చ॥అ॥ కామన్ ఏరియా, 100 చ॥అ॥ పార్కింగ్ ప్రాంతం మరియు దానిలోని అన్ని ఈజుమెంటరీ హక్కులతో. **టైటిల్ హోల్డర్ పేరు:** శ్రీ పవన్ బాగం, తండ్రి: బి. వెంకటేశ్వరరావు, అతని తరుపున పవర్ ఆఫ్ అటార్నీ ఏజెంట్: శ్రీమతి బాగం శ్రీలక్ష్మి, భర్త: బి. వెంకటేశ్వరరావు.

తేది: 10.10.2024, ప్రదేశం: విజయవాడ
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

"మానవుడు శాస్త్ర జ్ఞానాన్ని తప్ప
మరే జ్ఞానాన్ని కోరనవసరం లేని
పరిస్థితి ఏర్పడుతుంది. దానికి
విరుద్ధంగా ఉన్న అన్ని అపోహలను,
నమ్మకాలను పూర్వపక్షం చేయడం
పురోగామి సాహిత్య లక్షణం."
– కొడవటిగంటి కుటుంబరావు

రంగుల వరదలో రాగాల చెట్టు

ఒక వరద .. రంగుల వరద
పంటమళ్ల మీంచి .. పసిడిపొద్దుల
మీంచి ..
పూల పుప్పొడుల మీంచి ..
కొత్త కలల నారుమళ్ల మీంచి ..
ఆశల మీంచి ..
ఆకాంక్షల మీంచి .. ఒకటే వరద ..
నగ్నదేహాల నీలి వరద !

కలుషిత కాసారాలవుతున్నాయి
నిర్మలనదీ ప్రవాహాలు
మట్టికొట్టుకుపోతున్నాయి
మలయజ శీతల మందార వనాలు
ప్రాణవాయువు లేకపోయినా బతగ్గలనేమోగానీ ..
యివాల సిగ్నల్ లేకపోతే చచ్చిపోతున్నట్టుంది!

యే నీలివరద నా యింటిని ముంచేస్తోంది?
యే విధ్వంసం ..
నా బొందిలో ప్రాణాల్ని తోడుకుపోతున్నది?
యే రంగుల రాకాసి నా నట్టింట తిష్టేసి ..
నా భావితరాల మెదళ్లను పీల్చిపిప్పిజేస్తోంది?

సెల్ఫోన్లు టీవీలు ప్రైవసీ రూంలు
సోషల్ మీడియా కాంతి కెరటాల మీద
ఒకటే ఊరేగింపు
విచక్షణలేని బరితెగింపు
తరాల్ని ధ్వంసంజేస్తోంది దారి తప్పిన టెక్నాలజీ
ఒరే ఒరే .. ముందా వరదనాపండ్రా ..
అరచేతిలోంచి పొంగే నీలివరదకు
అడ్డుకట్ట వేయండ్రా ..
నట్టిల్లు నెట్టిల్లయ్యాక
మనిషి మనిషిలానే ఉన్నా
లోన మృగమేదో రంకెలేస్తోంది
నా దేహమిపుడొక
పోర్న్ భూతాల పాడుబడ్డ బంగ్లా
నా యిల్లొక దయ్యాల కొంప.. వర్చువల్ వల్లకాడు!

ఒరే నాయనా ..
ప్రగతి .. మానవ జీవితానికి సేతువు
కట్టు దాటిందా .. అదే నీ పతనానికది హేతువు!

– సిరికి స్వామినాయుడు
94940 10330

వేట కత్తె

అలా సముద్రాన్ని చూస్తూ
ఆమె పాట పాడుతోంది
అలల తప్పెట్ల శబ్దానికి
గొంతు కదుపుతోంది
పిల్లన గ్రోవి వాయిస్తూ
గాలి జత కలుస్తోంది
నిలువెత్తు పాటను
చూడటానికి సముద్రం
అంతెత్తున లేస్తోంది
ఈ రెండు పెదాల కోసమే
ఎదురు చూస్తున్నట్టు
శంఖువులు గొంతు సవరించుకున్నాయ్!

పాట వేగమందుకుని
దుఃఖంగా మలుపు తీసుకుంది
జీరగా నడుస్తున్న గొంతు
తీరపు హృదయంలో
అలజడి రేపుతోంది!

ఎంత మందిని
మింగావే సంద్రమా
మేము నడిపే సంసారపు నావలో
ఒంటరి తెడ్డును చేశావే సంద్రమా
ఎదురు చూసి,ఎదురు చూసి
ఎదనిండా ఏడుపు పూలు

ఈత నాకు కొత్త కాదే అంటూ
పాట ఎర్రగా మారింది
బొరియల్లోని పీతల కాళ్ళు
కవాతు చేస్తున్నాయ్
పాట సాగుతూనే ఉంది
సముద్రం
అంతెత్తున లేస్తూనే ఉంది!

– డాక్టర్ సుంకర గోపాల్
94926 38547

ఖమ్మం ఈస్తటిక్స్ - 2024 ఫలితాలు

ఖమ్మం ఈస్తటిక్స్ సాహిత్య పోటీకి 120కి పైగా కవితా సంపుటులు, 140కి పైగా కథలు వచ్చాయి. కవిత్వం విభాగంలో జూకంటి జగన్నాథం కవితా సంపుటి 'ఒక కప్పు చాయ్ నాలుగు మెసేజ్‌లు' రూ.40 వేల బహుమతిని గెలుచుకుంది. రాళ్ళబండి శశిశ్రీ కవితా సంపుటి 'అనుమంద్రం', తెలుగు వెంకటేష్ కవితా సంపుటి 'కబోధి చేపల కబుర్లు' ప్రత్యేక ప్రశంసకు అర్హంగా ఎంపికయాయి. ప్రముఖ కవి ఎన్. గోపి కవితా సంపుటి 'క్రియ ఒక జీవన లయ' ను కమిటీ విశిష్ట పురస్కారానికి అర్హమైనదిగా నిర్ణయించింది.

కథల విభాగంలో ఉత్తమ కథగా కేవి.మన్ ప్రీతమ్ 'నూరేళ్లమోసేతల్లి కథ' రూ.25 వేల బహుమతిని గెలుచుకుంది. ద్వితీయ ఉత్తమ కథగా సయ్యద్ గఫార్ 'న్యూ బాబాయిజం' 15 వేల బహుమతిని, తృతీయ ఉత్తమ కథగా కరీం 'ఝూజా' రూ.10 వేల బహుమతిని గెలుచుకున్నాయి. బహుమతులు గెలుచుకున్న కథలతో సహా పోటీకి వచ్చిన కథలలో 12 కథలను ఒక సంపుటిగా ప్రచురించాలని ఖమ్మం ఈస్తటిక్స్ కమిటీ నిర్ణయించింది. డిసెంబర్ 15వ తేదీన ఖమ్మంలో జరిగే సభలో విజేతలకు నగదు బహుమతితో పాటు షీల్డ్ అందించనున్నట్టు కమిటీ ప్రకటించింది.

సాహితీ కిరణం కథల పోటీలు

సాహితీకిరణం మాసపత్రిక వివిధ సంస్థల సౌజన్యంతో కథలపోటీలు నిర్వహిస్తోంది. విడదల నీహారికా సంక్రాంతి కథల పోటీ : ఈ పోటీలో 5 అత్యున్నత కథలకు ఒక్కొక్క కథకి రూ॥2000లు చొప్పున 5 సమాన బహుమతులు ఉంటాయి. కథ వ్రాతప్రతిలో ఎ4 సైజు పేపర్‌లో 6 పేజీలు డిటిపి అయితే 3 పేజీలు మించి ఉండకూడదు.

ముట్నూరు కమలమ్మ ఫౌండేషన్ చిన్న కథల పోటీ : ఈ పోటీలో 6 అత్యున్నత కథలను ఎంపిక చేసి ఒక్కొక్క కథకి రూ॥1000 చొప్పున 6 సమాన బహుమతులు ఇస్తారు. కథ నిడివి వ్రాతప్రతిలో ఎ4 సైజులో 4 పేజీలలోపు, డిటిపి అయితే 2 పేజీలకు మించి ఉండకూడదు. కథలు పోస్ట్/ కొరియర్ ద్వారా మాత్రమే పంపాలి. మెయిల్/వాట్సప్ ద్వారా పంపిన కథలు స్వీకరించబడవు. కథలు చేరవలసిన ఆఖరుతేది: 30.11.2024. చిరునామా : సాహితీకిరణం, ఇం.నెం.11-13-154, అలకాపురి, రోడ్ నెం.3, హైదరాబాద్-500102. వివరాలకు : 94907 51681.

మార్కెట్‌పై నిరసన తోరు



పుస్తకం

"ఒక జాతి ఎంతవరకు సజీవంగా ఉన్నదీ సూచించే టందుకు సాహిత్యం తప్ప మరేముంది? అలాగని ఏకకావ్యం సాహిత్యం కాదు. ఒక కావ్యం జీవితాన్నంతా సమగ్రంగా అంటలేదు. ఒక జాతి సమగ్రంగా తన సాహిత్యం సృష్టించుకున్న రోజున ఆ సాహిత్యం ఆ జాతిని పైకెత్తకుండా ఉండలేదు. ఏక కావ్యాలు ఆ పని చేయలేవు. అందుకని ఏ తరం వారు ఆ తరం సాహిత్యాన్ని సష్టించుకో వలసిందే." అంటారు కొకు. అలా నిరంతరం సాహిత్యాన్ని సష్టించి తెలుగుజాతిని సజీవంగా నిలబెడుతున్న రచయితలు ఎందరో! ఆ వర్ధమాన రచయితల్లో నెల్లిమర్లకు చెందిన మొయిద శ్రీను ఒకరు. వర్తమాన మార్కెట్ విధ్వంసాన్ని కవితా వస్తువుగా, సరళమైన భాషలో వ్యక్తీకరిస్తున్న కవి తను. 2014లో 'సముద్రమంత చెమట చెక్క' పేరుతో తన మొదటి కవితా సంకలనాన్ని వెలువరించారు. పదేళ్ల తర్వాత, 'కరవాక' పేరుతో తన రెండో కవితా సంకలనాన్ని తీసుకువచ్చారు. ఈ సంపుటిలో 41 కవితలు, ఆరు అనువాద కవితలు ఉన్నాయి. వీటన్నిటిని పరిశీలిస్తే ఈ కవి కష్టజీవులకు కాపు కాస్తున్నాడు. వారి శ్రమను దోచుకున్నవారిని తన వాక్యాల్లో నిరసిస్తున్నాడు. తనను కవి కోకిలగా కాకుండా, దోపిడీదారులనే గద్దను తన్నే కాకిగా అభివర్ణించుకుంటున్నాడు.

"ఎర్రటిపండును తింటూ/ ముల్లును ఇల్లుగా మలుచుకుంటూ
రేపటి వేకువకై / చీకటి గ్రద్ద నెత్తిన తన్నే
కాకి అంటే నాకిష్టం" (కాకి)
"కవులు.. శ్రమైక జీవన ప్రతీకలైన కాకులై ఉంటే
అల్ప జీవులపై దాడి చేసిన/ అలసిన గ్రద్ద రెక్కలను
ఈపాటికే కత్తిరించి ఉండేవి" (ఓ గ్రద్ద ఘోష)

పచ్చని చెట్టు నీడ నాశ్రయించి, మెత్తని మావిచిగురులను మేస్తూ పాడిన పాత పాటనే పాడుకునే కవి కోకిలగా కాకుండా, కాకిగా ఉండడమే తనకిష్టమని కవి కొత్త ఎరుకను ఎత్తుకున్నాడు. తను నెల్లిమర్లకు చెందినవాడు. నెల్లిమర్ల జూట్‌మిల్ ఉద్యమంపై సానుభూతి కలవాడు. 'జనవరి 29, చిగురించే చేతివేళ్ళు' కవితలలో ఆ శ్రామికులపై తన సహానుభూతిని ప్రకటించాడు.

ఈ కవి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ప్రభుత్వ బడుల్లో చదువు కుంటున్న పిల్లలను దగ్గరుండి చూస్తున్నవాడు. నేడు ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న చాలామంది పిల్లల తల్లిదండ్రులు, అయితే కూలికి పోవడమో, లేకపోతే వలసకుపోవడమో అనివార్యంగా ఉంది. కొంతమంది పిల్లలు సైతం బడి లేని సమయాల్లో ఇంటి పనిలో సాయం చేయడమో, కూలికి పోవడమో చేస్తుంటారు. ఇలాంటి వారిపై సహానుభూతితో కొన్ని కవితలు కట్టారు ఈ కవి.

"అలసిన ప్రాణాలై వాళ్ళ అమ్మలింటికొచ్చేసరికి
ఖాళీ తనాన్ని భరించలేక / బోరింగు మూతి కింద నిండి
ఆకలి మంటపై ఉడికిన అన్నమవటానికై
చీకటంటుకున్న తపాలాలను తోముతాయి."
(వేలాడే తాళం చెవులు)
"పిల్లాడి అమ్మానాన్నేరనడిగాను
మదుపులు మేత మరిగిన మడిసెక్క ఆకలి అప్పుకై
చిరిగిన చొక్కా జేబును సరి చేసుకోడానికి
పట్నం పోయారంది
పండక్కో పబ్బానికో తిరిగొస్తారంది" (migration)

లెక్కల్లో చూపించడానికి అయినా చదువు మీద ప్రభుత్వాలు శ్రద్ధ పెడుతున్నప్పటికీ, తరతరాలుగా పట్టిపీడిస్తున్న పేదరికం, పిల్లలకు ఇంకా సరైన చదువు వాతావరణం కల్పించలేకపోతుందనే ఆవేదన పై రెండు కవితలలో మనకు కనిపిస్తుంది.

ఈ కరవాక సంకలనంలో కవి ఎక్కువగా తడిమిన అంశం మార్కెట్. 90ల ప్రాంతంలో భారతదేశంలో ప్రారంభమైన ల్పా+ ఆర్థిక సంస్కరణల ఫలితాలను పూర్తిగా అనుభవిస్తున్న తరం మొదలైంది. అవి నిజంగా మంచి ఫలితాలు ఇస్తుందా? ఈ ఫలితాల వల్ల ప్రజలందరూ నిజంగా సంతోషంగా ఉంటున్నారా? స్వతంత్రంగా ఆలోచించగలుగుతున్నారా? లేక మార్కెట్ నియంత్రణలో నడుస్తున్నారా? మొదలైన ప్రశ్నలకు సమాధానాలు గా చాలా కవితలు ఈ పుస్తకంలో ఉన్నాయి.

"మన నెత్తిన కూర్చుని/ పనులు చేయమంటూ ఒత్తిడికి గురిచేస్తూ / గొంగళి పురుగు ఆకును కొనుక్కుతినేలా / కాలాన్ని కొద్ది కొద్దిగా కొరుక్కు తింటుంది" (కాలాన్ని కొరుక్కు తినేది).

ఇంటిలోనే కాకుండా ఒంటి మీదకు వచ్చి నిత్యం పరుగులు తీయిస్తున్న పెట్టుబడిదారుడి కాపలా కుక్కగా గడియారం పని చేస్తుండడాన్ని కవి వ్యక్తీకరిస్తున్నాడు.

"ఖాళీ లేదు/ అస్సలు ఖాళీ లేదు
ఓ చెమట చుక్క నేలరాలి / నెత్తుటి చుక్కయైనప్పుడు
నాలుగు కన్నీటి చుక్కలను / రాల్చే వీలు లేదు"
(ఖాళీలేనితనం)

ప్రతి మనిషీ ఖాళీ లేకుండా పనిచేయాల్సిన పరిస్థితి కల్పించిం ది మార్కెట్. ఈ ఖాళీ లేని తనములో ప్రతి కుటుంబ పెద్ద స్లేవ్ డీలర్‌గా మారిన సందర్భాన్ని – "ఎవరు కాస్త ఆగాలని చూసినా వేరొకరి కాళ్ళ కింద పడి చావాల్సిందే" (slave dealer). ప్రతి ఒక్కరిని పోటీదారుడుగా చూడాల్సిన పరిస్థితిని కల్పించిన మార్కెట్ మాయని వివరిస్తున్నాడు.

"నా అర చేతిలో ఉన్న/ బుల్లి ప్రపంచంలో..
నా చూపుడు వేలుతో తాకుతానంతే
నా ముందుకు కుప్పలు తెప్పలుగా
వస్తువులొచ్చి నిలుచుంటాయి
నాకు కావలసిన వస్తువును/ అలా సుతారంగా
తాకుతానంతే
క్షణాలలో నా కార్డులో ఉన్న/ కొన్ని చెమట
చుక్కలు
ఆ నది తాగేస్తుంది!"
.....
ఆ నది వెనుక ఓ సముద్రం దాగున్నదన్న
సంగతి
నాకు ఇప్పుడిప్పుడే అర్థమవుతుంది.. (ఒక పెద్ద
నది)

ఒకప్పుడు ప్రజలంతా తాము తినీ తినకుండా, తమ శ్రమ ఫలితాన్ని తమ తర్వాత తరాలకు అందివ్వాలని బంగారం రూపం లోనో, భూమి రూపంలోనో దాచుకునేవారు. ఇప్పటితరం ఆ ఆలోచన చేయకుండా మార్కెట్ మనుషులకు కొత్త కొత్త అవసరాలను సృష్టిస్తుంది. భవిష్యత్తుకు తన శ్రమను జామీనుగా పెట్టి మరీ మార్కెట్ వలలో చిక్కుకుంటున్నాడు. మనిషి చెమట చుక్కలను మార్కెట్ ఎలా లాగేస్తుందో 'ఒక పెద్ద నది' కవితలో వినిపిస్తున్నాడు.

"పల్లె కొట్లలో/ చిన్న ప్యాకెట్లలో దాగిన వ్యాపార సూత్రం..
ఇప్పుడన్నీ చిన్నవేలాగున్నాయన్న/ నా ప్రశ్నకు 'అందరూ కొనాలి కద సార్" అన్న సమాధానం
ఓ స్మాల్ కోలా డ్రింకై నన్ను కూల్ చేసింది" (కొనాలి).

మార్కెట్ భూతం తనను తాను ప్రతి మూలకు ఎలా విస్తరించుకుందో ఈ కవితలో వివరిస్తున్నాడు.

మరి ఉత్పత్తిలో భాగమైనవారి జీవితాలు మార్కెట్ విస్తరించి నట్టుగా అభివద్ధి చెందాయా? లేదు! వారి జీవితాలు ఇటు ఉట్టికి, అటు స్వర్గానికి కాకుండా ఎలా ఊగిసిలాడుతున్నాయో ఝఅవనబఱఅ, ఎవరామె, బొంకుల దిబ్బ' కవితలలో వివరించాడు.

చిరిగిన బతుకు బట్ట.. కుట్టుకై/ చాలీచాలని దారంలా
జీతం
పనిలో ప్రకతావసరాలకు సైతం/ కాలు మడుచుకునే తీరిక లేనితనం/ నీరసమై ఆవహిస్తుంటే/ టార్గెట్లను పూర్తి చేస్తోంది ఎవరామె? (ఎవరామె..?) శ్రమ దోపిడీని వివరిస్తుంది ఈ కవిత.

'సామాన్యులు అసామాన్య విషయాలను చూసి ఆశ్చర్య పోయినట్లే గొప్ప కవులు సామాన్య అంశాలను చూసి అబ్బురం చెందడం యోగి లక్షణం' అంటారు కున్వర్ నారాయణ్. ఈ కవి కూడా తన చాలా కవితల్లో సామాన్యమైన అంశాల్ని అబ్బురంగా చెప్పడం మనకు ఒకింత గిలిగింతను కలిగిస్తుంది.

"టీ ఒంటరిది కాదు/ టీది సామూహిక తత్వం
నేలరాలిన టీ చుక్కలకు సైతం/
నాలుగు ఈగలనో
చీమలనో కలిపే గుణముంది." (the morning song)

మనం రెగ్యులర్గా చూసే 'టీ' ని సామూహిక గుణం కలిగే వస్తువుగా అభివర్ణిస్తాడు.

"మడిలో కొడవలి బొరుగులైన వాళ్ళు"
"నగర నిర్మాణంలో పారాంగమేలాలు అవుతారు.".
"ముడతల చీర", "చిరుగల నిక్కరు", "పచ్చబొట్టు పొడుస్తున్న మట్టి గాజు".. మొదలైన ప్రతీకలను సందర్భానుసారంగా అందంగా వ్యక్తీకరించాడు ఈ కవి.

"ఏ కాలపు జీవితాన్ని విమర్శించేది ఆ కాలపు సాహిత్యం. నేటి జీవితాన్ని విమర్శించలేనిదీ, నేటి భావాలను సంస్కరించ లేనిదీ, నేటి జీవితాలను అలంకరించలేనిదీ నేటి సాహిత్యం కాదు.. నేడు రాసినవాడైనా.." అని అంటాడు కొ.కు. ఈ మొయిద శ్రీను కూడా తన అనుభవానికి వస్తున్న, తన చుట్టూ జరుగుతున్న జీవితాన్ని సాహిత్యం మయం చేస్తున్నాడు. "ముక్తి మార్గం ఎక్కడ దొరకకపోతే నేను రాయాలనుకుంటాను. రాయడం వల్ల ఏదీ జరగదని తెలిసి కూడా నేను రాయాలనుకుంటాను" అంటారు ప్రముఖ కవి కేదార్నాథ్ సింగ్. అవును.. రాయడం వల్ల ఏదీ జరగదని తెలిసినా రాస్తూనే ఉండాలి. ఏదైనా జరిగేంతవరకూ రాయాలి. అలా ఈ కవి కూడా తన కాలపు జీవితాన్ని రాయడంలో మరింత ముందుకు వెళ్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ పుస్తకం ప్రతులకు 99082 56267 నెంబరును సంప్రదించొచ్చు.

– ఆల్తి మోహనరావు
99638 95636

విభిన్న స్పందనల అల్లిక

ఒక కవి యొక్క కవితల సంపుటిలో ఆ కవి రచనా శైలి మాత్రమే మనకు తెలుస్తుంది. అదే కవితల సంకలనంలో అయితే అనేక మంది కవుల అంతరంగం ఒక వైపు, సారాంశం మరోవైపు పోటీ పడుతుంటాయి. తెలుగు సాహితీ వనంలో ప్రతి నెలా నిర్వహించే పోటీలో విజేతలైన వారి ఉత్తమ కవితలను, కవిసమ్మేళనంలో చదివిన ప్రముఖుల కలాల నుంచి జాలువారిన కవితలను, టీమ్ సభ్యుల కవితలను ఒక్కచోట చేర్చి 'అలవోక' కవితా సంకలనంగా ప్రచురించారు. ఇందులో దాదాపు 96 మంది కవితలను మనం చూడవచ్చు. ఈ సంకలనం గురించి సంపాదకులు శాంతికృష్ణ పరిచయం చేస్తూ, 'గుండె గూటిలో చెమరింతల చెలమలుగా, మనసు ముంగిట్లో కురిసే అనుభూతుల వానగా, సాహిత్యమనే 'కడలి'లో చేరేవరకూ జీవనదంలా' కవితలను అభివర్ణించారు. ఈ పుస్తకానికి అందమైన, అర్థవంతమైన ముఖచిత్రాన్ని రాజు చిత్రాలయ అందించారు. ప్రముఖ సాహిత్య విమర్శకులు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి పరిచయ వాక్యాలు రాశారు.

'అలవోక'లోని 96 కవితల్లో కొన్నింటిని పరామర్శిద్దాం. వ్యవస్థలోని దుర్గుణాలను 'అయిదోగది కావాలి' కవితలో కవయిత్రి సత్య చాగంటి వివరించిన తీరు మానవత్వమున్న మనిషిని కదిలించి వేస్తోంది. 'కలానికి, హలానికీ కూడా కుల తిలక మంటించి' 'రేకులు విచ్చుకోని లేత గులాబీని నులిమేస్తున్న రాక్షస హస్తాలు' అంటూ ఎన్నో సామాజిక అంశాలు లేవనెత్తి మార్పు కోసం ఆలోచింప చేస్తోంది. 'నమ్మండి నేనూ అనాధనే' కవితలో డా. కె జి వేణు సున్నితమైన అంశాన్ని ఆక్రందనతో, ఆవేదనతో రాశారు. 'అతి క్రూరంగా ఇద్దరు కలబడిన ప్రతిసారి బీభత్స దృశ్యాలు పురెలై నా మెడలో వ్రేలాడుతున్నాయి" అన్న వాక్యం పఠితులను కదిలిస్తుంది. తల్లితండ్రులు బాధ్యతారాహిత్యంగా పిల్లలు ఎదుటే గొడవలు పడుతున్నప్పుడు ఆ పసివారి మానసిక స్థితికి ఈ వాక్యం అద్దం పడుతుంది. 'జ్ఞాపకాల దొంతరలు' కవితలో డా.సంధ్యారాణి 'పూలంటే నాకు పదిలంగా దాచుకున్న జ్ఞాపకాల దొంతరులు' అని ఆఖరి వాక్యంగా రాసి ముందు వాక్యాలలో చక్కటి అనుభవాలను, ఆనందాలను, పోలికలను ఏర్చి కూర్చారు.

'ఇంటికి చుట్టాలొస్తే అటకపై సేదతీరుతున్న ఇత్తడి బిందెను వారి కంచంలో బువ్వగా మార్చేది' అంటూ పేదరికపు తల్లి పడే వేదన ఒక వైపు, పెట్టే గుణం ఒక వైపు, ఈ రెండిటినీ కలగలిపి 'మాతృమూర్తి' కవితలో కవి చాకచక్యంగా రాసి తన కవిత్వ పటుత్వాన్ని చూపించగలిగారు. రాజశేఖరుని శ్రీ శివలక్ష్మి ... అక్షరాల అరణ్యాన్నై... కవితలో 'ఎన్నిసార్లు మరణించినా మళ్ళీ మళ్ళీ చిగురిస్తుంటాను ఎందుకంటే అక్షరాల అరణ్యం నేను' అని రాశారు. సమాజం పట్ల కవయిత్రి యొక్క ఆవేదన, ఆరాధన, ఆలోచన ఈ కవితలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. 'సుమాంతరంగం' కవితలో జానకీదేవి ... 'తరువులకూ తప్పని వేదనే కదా ఏ గుడికో, ఏ సిగకో విరి తనయులను సాగనంపడం' అని రాసి కరుణ శ్రీ పుష్పవిలాపాన్ని గుర్తు చేశారు.

'గుడ్డి కొంగ' కవితలో డా.ఏనుగు నరసింహారెడ్డి అమ్మ గురించి రాసి మన మనసులను కరిగించి, కదిలించి వేశారు. 'నీళ్లను, బియ్యాన్ని ఏ నిష్పత్తిలో గాలిస్తే రాళ్ళ బాధలను అడుగు పట్టించవచ్చో తెలిసిన మహా నేర్పరి ఆమె' అంటారు అమ్మ గురించి. 'చిట్టు పొయ్యి మూడు ఇటుకుల అంచులోపల భగ్గుమనకుండా మండుతుండే కనిపించని జ్వాల ఆమె' అని చెబుతూ, మరోపక్క 'అన్ని కాలాలు శిశిర పక్షాలే' అంటూ అమ్మ ఇక్కట్ల గురించి ఆవేదన వ్యక్తం చేశారు. 'మాతృత్వం' కవితలో సాంబమూర్తి చెల్లూరి ... అమ్మ అంటే మనకు ఎలా గురువో స్పష్టంగా వివరించారు. 'పసిమనసున చవిచూసిన అతి సున్నిత వేదనలే పెనుభారము అయినవేళ దరికి చేరి అనునయన పరిష్కార మార్గాన్ని చూపు నిజమగు నేస్తమే తాను' అని చిన్న చిన్న పదాలతో నగ్న సత్యాన్ని సామాన్యులకు కూడా అర్థం అయ్యేలా వివరించి సఫలీకృతులయ్యారు.చ శ్రీధర్ రెడ్డి బిల్లా కవిత 'ప్రశ్న' నిజంగానే పెద్ద ప్రశ్న. అడిగే ప్రశ్నలకు జవాబులు లేక మిగిలిపోయిన ప్రశ్నలు ఇవి. ఇంత ఆసక్తి కలిగిన ప్రశ్నలు ఏమిటనే ఆలోచనకు జవాబు 'అలవోక' తప్పక చదవండి. మంచి కవిత్వం చదివాననే సంతృప్తి మీకు కలుగుతుంది. పుస్తకం కోసం 95022 36670 నెంబర్లో సంప్రదించవొచ్చు.

– రామగోపాల్ కొమ్ముల
88865 01012

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా..
prajasavvadi@gmail.com

సాంబడు

కాటుక డబ్బాలో ముంచి తీసినట్టు జుట్టు
నొసటి భాగం చదునైన మడిచెక్క
ఇండిప్పిక్క కళ్ళు కాగుకాయ కనుబొమలు
వీపు చాపరాయి, బోర బోడికొండ బురుజు
పిక్కలు కండ పట్టిన పెండలాలు
బిగుతైన మొలకట్టు చూపు చురుకైన వాసం మేకు
పెదాల మధ్య నేరేడు నవ్వు
చేవదేరిన పాసిగున్నలా సాంబడు...

ఏ సింధునది బాడవాల్ని పెల్లగించిన వారసత్వమో!
ఏ మెహంజదారో గుట్టల్ని దొలిచే ఎముకల పటిమో!
ఏ మెసపటోమియా సంతల్లో
చెమటను కాసులుగా మారకం చేసుకొనే శ్రమతాత్వికమో!
పగటికి రాత్రికి తేడా తెలియని పనిగొడ్డు సాంబడు...

పిడికెడు బత్తెపు ఆరాటం
ఇలిసి పిల్లాలా సాంబడు మొహంలో ఎగిరెగిరి పడుతుంది
మూలవాసైన చెమట ధర్మం
సాంబడి నడకలో ఛాతి విరుస్తుంది...
రెక్కలు తొడిగిన శ్రమగోళం
సాంబడి మాటగా రెపరెపలాడుతుంది...!

మిరువుకు ఎగపారే గడుసు కాలువ సాంబడు
కారి మెరక్కైనా నెర్రనెయ్యగల నక్కు సాంబడు
సిటారు పిందెనైనా గురిచూసి రాల్చగల
వడిసెకాడు సాంబడు
ఎకరాల కొద్ది గొప్పులో బొర్రిగై బంగిర్లెత్తుతాడు...!
పరకలపై నూరుపుగొడ్డై పొర్లిపోతాడు
కుడుబెయ్యనుంచి సూడిగేదె వరకు
సావాసమెరిగిన సొమ్మలోడు సాంబడు
ఊరి కూరపెరడులకి ఊడికపెండి సాంబడు
బుగతకి జోడెద్దుల పూటు సాంబడు

ఈత మొజ్జులా గరుకుదేరున్నా
లోన కంజెలా మెత్తని పలకరింపు సాంబడు
ఎంత బఠ్రాడినా... లేనితనపు బతుకులోటు సాంబడు
చెమటతోపాటు అస్పృశ్యతను
పిత్రార్జితంగా సంక్రమించుకున్న పురోణీ సాంబడు
మట్టిలోంచి పుట్టిన మెరుపు సారమైనా
ముసురుకొన్న వెలి చీకటి సాంబడు!

– కలమట దాసుబాబు
80967 03363

ఆదర్శాల బాటలో 'డియర్ కామ్రేడ్'

ఉద్యమ మిత్రుల చేత కె.ఎస్ అని పిలిపించుకున్న కుడిపూడి సూర్యనారాయణ కాకినాడ ఇంద్రపాలెం ప్రాంతంలో నివసించిన ఒక ఆదర్శ మానవుడు. ఆయన అమరుడయ్యి ఇరవై ఏండ్లైనా తన జ్ఞాపకాలను మాత్రం చాలామంది కమ్యూనిస్టు కార్యకర్తలలో పదిలంగా వుంచాడు. కాకినాడలో కె.ఎస్ కార్యక్షేత్రంలో పాలుపంచుకున్న సహచరులంతా ఆయనను 'డియర్ కామ్రేడ్' అని తలుచుకుంటూ తన ప్రాసంగికతను గుర్తు చేసుకుంటూ, ఆలోచనలు పంచుకుంటూ యీ పుస్తకాన్ని తెచ్చారు.

అదనపు ఆదాయానికి నిలయమైన రిజిస్ట్రేషన్ శాఖలో వుద్యోగం చేసినా నీతి నిజాయితీగా వుండడం, ఉద్యోగస్తుడై పెళ్లి పేరుతో అందలాలు ఎక్కగలిగే అవకాశం వుండీ వితంతువును ఆదర్శ వివాహం చేసుకోవడం, పార్టీ సభ్యత్వం లేని రోజుల నుంచే కార్యకర్తగా ప్రజాసంఘాలకు వెన్నుదన్నుగా వుండటం, కుటుంబ బరువు బాధ్యతలు వున్నా ఎందరో కార్యకర్తలకు ఆర్థిక సహాయాలు అందించడం; హేతువాదిగా, పుస్తక ప్రేమికుడిగా తన చుట్టూ వున్న ప్రజలను పుస్తకాలు చదివించడానికి, హేతుబద్ధమైన నిర్ణయాలు తీసుకోవడానికి దిశా నిర్దేశం చేయడం, ఇంద్రపాలెం ప్రజలకు నిరంతరం అందుబాటులో వుంటూ ప్రజాహిత కార్యక్రమాల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం; పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నిక అవడానికి అవకాశం వచ్చినా వద్దనుకొని యువకుడిని నిలబెట్టి గెలిపించుకోవడం; తన బిడ్డలకు కులాంతర ఆదర్శ వివాహాలూ, కొడుకులకు కట్నం లేని పెళ్లిళ్లు చేయడం, అలాంటి పెళ్లిళ్లను ప్రోత్సహించడం, అలాంటి జంటలను తన యింటనే వుంచుకొని మద్దతివ్వడం ఆయన ఆదర్శ ఆచరణ. సమావేశాలలో పార్టీ దృష్టికోణాన్ని దాటకుండా చూడడం, అభిప్రాయాలు చెప్పడంలో నిక్కచ్చితనం, సునిశితత్వం; ఇంటిపనీ, వంటపనీ పట్ల గౌరవం, శ్రామికుల మీద ఆప్యాయత, పిల్లలకు విజ్ఞానదాయక విషయాల మీద పుస్తకాలు పంచి చదివించడం, భార్య అనారోగ్యం పాలైతే శుశ్రూష చేయడం... యిట్లా ఆయనలో వున్న ఆదర్శాలనూ, ఆచరణలనూ వివరిస్తూ రాసిన 25 వ్యాసాల పుస్తకం ఇది.

ఈ పుస్తకాన్ని చదివితే, ఒక సాధారణ మానవుడిగా, నిరాడంబర జీవితం గడుపుతూ కూడా ఎంత అసాధారణంగా ఎంత ప్రభావవంతంగా వుండొచ్చో కె.ఎస్ అనబడే కమ్యూనిస్టు నిరూపించాడని తెలుస్తుంది. ఎంత అలవోకగా, ఎంత సహజంగా నీటిలో చేపలా జనాల్లో కలగలసి వాళ్లని ప్రేమిస్తూ తాను నమ్మిన భావాలను వాళ్లూ అలవరచుకునేలా చేసాడు కదా అని ఆశ్చర్యం కలుగుతుంది. ఒక చిరుద్యోగి తనింటి నలుగురు పిల్లల్ని ప్రయోజకులను చేయడమే కాకుండా బయట సమాజంలో డజన్ల మందికి జీవనోపాధులూ, ఆసరాలూ చూపించాడు. వాళ్లలో కొందరినైనా కమ్యూనిస్టు మార్గంలో ప్రజా రాజకీయాలు చేసేవారిగా నిలబెట్టగలిగాడు. కమ్యూనిస్టులకు కానికాలమని మనమనుకుంటున్న యీ కాలంలో యీ పుస్తకాన్ని చదివినవారిలో కొందరికైనా కె.ఎస్ నడిచిన దారి పట్ల దురభిప్రాయాలు తొలగి గౌరవం పెరుగుతుంది.

పెద్ద పెద్ద నాయకుల గురించి మహాకథనాలు నడుస్తూ వుంటాయి. అయితే స్థానీయ ప్రాంతాల్లో ఉపకథనాల వంటి, వేర్ల వంటి, ఊటల వంటి, రక్తనాళాల వంటి, సామాన్య కథనాలూ వుంటాయి. అలాంటిదే యీ పుస్తకం. కె.ఎస్ లాంటి వాళ్లు పునాదిరాళ్లు. ఈ పునాదుల పైననే మహా నిర్మాణాలు జరుగుతాయి. ఈ పుస్తకం ఒక పునాది రాయి చరిత్ర. పునాది రాయి ఎలా తయారవుతుందో చెప్తుంది. దీన్ని చదివిన వాళ్లలో కొందరినైనా పునాదిరాళ్లుగా మార్చే శక్తి గలదీ పుస్తకం. పుస్తకం కావల్సిన వారు 95732 31226 నెంబర్‌కు వాట్సపులో చిరునామా పంపితే పోస్టు చేస్తారు.

– జి.వెంకటకృష్ణ

బ్రిటన్ కన్సర్వేటివ్ పార్టీ కొత్త నేత కెమీ బాడెనోచ్

లండన్: బ్రిటన్ కన్సర్వేటివ్ పార్టీ కొత్త నేతగా కెమీ బాడెనోచ్ ఎన్నికయ్యారు. జులైలో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో అధికార కన్సర్వేటివ్ పార్టీ చావు దెబ్బ తినడంతో రిషి సునాక్ స్థానంలో బాడెనోచ్ పార్టీ పగ్గాలు చేపట్టనున్నారు. . కన్సర్వేటివ్ పార్టీ నాయకత్వ బాధ్యతలను నల్లజాతి మహిళ ఒకరు చేపట్టడం ఆ పార్టీ చరిత్రలో ఇదే మొదటిసారి. పార్టీ చీఫ్‌గా శనివారం ఎన్నికైన 44 ఏళ్ల బాడెనోచ్ ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. లెఫ్ట్ వైపు మొగ్గిన రాజకీయ కేంద్రాన్ని తిరిగి సాంప్రదాయక ఆలోచనలవైపు తీసుకొస్తానని అన్నారు. పార్టీ నాయకత్వానికి నెల రోజులుగా సాగిన పోటీలో చివరికి బాడెనోచ్‌యే గెలిచారు. పార్టీలో అమెకు అనుకూలంగా 53, 806 మంది సభ్యులు ఓటు చేయగా, సమీప ప్రత్యర్థి మాజీ ఇమిగ్రేషన్ మంత్రి రాబర్ట్ జెన్రిక్‌కు 41, 388 ఓట్లు వచ్చాయి. 650 సీట్లు ఉన్న బ్రిటన్ పార్లమెంటు దిగువ సభకు జులైలో జరిగిన ఎన్నికల్లో కన్సర్వేటివ్స్ బలం 365 సీట్ల నుంచి 121కి పడిపోయింది.

ప్రముఖ కన్నడ దర్శకుడు గురుప్రసాద్ మృతి

బెంగళూరు : ప్రముఖ కన్నడ దర్శకుడు గురుప్రసాద్ (52) మరణించారు. మాట, ఎడ్డెలు మంజునాథ, డైరెక్టర్ స్పెషల్ వంటి పలు ప్రశంసలు పొందిన చిత్రాలను రూపొందించిన గురుప్రసాద్ మదనాయకనహళ్లిలోని తన అపార్ట్‌మెంట్‌లో శవమై కనిపించారు. అపార్ట్‌మెంట్ నుండి దుర్వాసన రావడంతో పొరుగువారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు తలుపులు పగుల గొట్టి చూడగా.. గురుప్రసాద్ సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరివేసుకుని మరణించినట్లు గుర్తించారు. రుణాల ఒత్తిడి వల్ల అత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు తెలిపారు. గురుప్రసాద్ దర్శకత్వం వహించడంతో పాటు పలు చిత్రాలలోనూ నటించారు.

కేంద్రమంత్రి సురేష్ గోపిపై కేసు

తిరువనంతపురం : అంబులెన్స్‌ను దుర్వినియోగం చేయడంతో కేంద్ర పర్యాటక శాఖ సహాయక మంత్రి సురేష్‌గోపిపై కేసు నమోదైంది. అంబులెన్స్ దుర్వినియోగంతో పాటు అతి వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌పై బిఎన్ఎస్ 279, 34, మోటార్ వాహనాల చట్టం 179, 184, 192 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు త్రిస్సూర్ ఈస్ట్ పోలీసులు ఆదివారం తెలిపారు. సురేష్‌గోపితో పాటు అభిజిత్ నాయర్, అంబులెన్స్ డ్రైవర్‌లను కూడా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. పుల్లాజికి చెందిన సురేష్ భవదాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైంది. త్రిస్సూర్ పూరమ్ ఉత్సవానికి సురేష్ గోపి అంబులెన్స్‌లో హాజరవడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే.

పాక్‌లో మరో రెండు పోలియో కేసులు

ఇస్లామాబాద్ : పాకిస్థాన్‌లోని ఖైబర్ ఫక్తుంక్వా ప్రావిన్స్‌లో కొత్తగా రెండు పోలియో కేసులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. దీంతో పాకిస్థాన్‌లో ఈ ఏడాది పోలియో కేసుల సంఖ్య 45కి చేరింది. లక్కీ మార్వాత్, డేరా ఇస్మాయిల్ ఖాన్ ప్రావిన్స్‌లలో తాజా కేసులు వెలుగుచూశాయని నేషనల్ ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్ పేర్కొన్నట్లు స్థానియ మీడియా తెలిపింది. ఈ కేసులను డబ్ల్యుపివి1గా ప్రాంతీయ లేబరేటరీ నిర్ధారించినట్లు పేర్కొంది. ఈ రెండు జిల్లాల నుండి ఈ ఏడాది పోలియో కేసు నమోదు కావడం ఇది రెండవసారి. ఈ ప్రాంతంలో వైరస్ వ్యాప్తి చెందే ప్రమాదం అధికంగా ఉన్నట్లు తెలిపింది. కౌంటీలో నాలుగు ప్రావిన్స్‌లోని 76 జిల్లాల్లో డబ్ల్యుపివి1ని గుర్తించామని అధికారులు తెలిపారు. ఈ కేసులతో దేశవ్యాప్త పోలియో నిర్మూలన కోసం చేపడుతున్న కార్యకలాపాలను మరింత వేగవంతం చేయాల్సి వుందని పేర్కొన్నారు. బలూచిస్తాన్ నుండి 22, సింధ్ నుండి 12, ఖైబర్ ఫఖ్తుంక్వా నుండి 9, పంజాబ్, ఇస్లామాబాద్‌ల నుండి ఒక్కొక్కటి చొప్పున దేశవ్యాప్తంగా మొత్తం 45 కేసులు రికార్డయ్యాయి. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ఐదేళ్లలోపు 4.5 కోట్ల మంది పిల్లలకు టీకాలు వేయాలనే లక్ష్యంతో చేపడుతున్న 'వారం రోజుల పోలియో వ్యాక్సినేషన్ ప్రచారం' గత సోమవారం ప్రారంభమైంది.

నిధులు ఎందుకివ్వలేదో వివరణ ఇవ్వాలి

- బిజెపికి కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ : జార్ఖండ్‌కు రూ.1.36 లక్షల కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదో బిజెపి వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. లక్షల కోట్ల బొగ్గు రాయితీలు, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను జార్ఖండ్‌కు కేంద్రం బకాయి ఉందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో ఆదివారం పోస్టు చేశారు. జార్ఖండ్‌లో కోల్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన అనుబంధ సంస్థలు బొగ్గు గనులను నిర్వహిస్తున్నాయని, ఇవి రాష్ట్ర ప్రభుత్వానికి భారీ మొత్తంలో బకాయిలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో బిజెపి ఎందుకు విఫలమైందని, ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారని జార్ఖండ్ బిజెపిని జైరాం రమేష్ ప్రశ్నించారు.

హర్యానాలో డిఎపి సంక్షోభం

- రోడ్డెక్కుతున్న రైతన్నలు
- సహకార సొసైటీల వద్ద పోలీసుల మోహరింపు
- 1.1 ఎల్ఎంటి కేటాయించిన కేంద్రం

ఆందోళన చేస్తున్న రైతులు

చండీఘర్ : హర్యానాలో డిఎపి ఎరువు కొరత తీవ్ర సంక్షోభాన్ని కలిగిస్తోంది. ఎరువు కోసం రైతన్నలు సహకార సొసైటీల ఎదుట బారులు తీరుతున్నారు. వీరిని అదుపు చేసేందుకు పోలీసులను కూడా నియమించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర రైతాంగానికి 1.10 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటి) డిఎపిని కేటాయించింది. ఇందులో ఇప్పటికే 40 ఎల్ఎంటి ఎరువును ఓడరేవుల నుండి రాష్ట్రానికి పంపారు. ఈ ఎరువు ఈ నెల 7వ తేదీ నాటికి రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చేరుకుంటుందని భావిస్తున్నారు. కేంద్రం కేటాయించిన ఎరువు మొత్తం ఈ నెల 17వ తేదీ నాటికి రాష్ట్రానికి చేరుతుంది.

డిఎపి ఎరువును సకాలంలో సరఫరా చేయాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ కేంద్ర మంత్రి నడ్డాను పదేపదే కోరుతున్నారని ప్రభుత్వ అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లో హర్యానాకు 2.6 లక్షల మెట్రిక్ టన్నుల డిఎపి అవసరమవుతుందని అంచనా. గత సంవత్సరం అక్టోబరులో రాష్ట్ర రైతులు 1.19 ఎల్ఎంటీని వినియోగిస్తే ఈ ఏడాది అదే నెలలో 1.15 ఎల్ఎంటిని మాత్రమే వాడారు. ఈ ఏడాది అక్టోబరులో 1.10 ఎల్ఎంటి డిఎపిని అందజేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని, కానీ 85,000 ఎల్ఎంటీనే ఇచ్చిందని హర్యానా ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి (వ్యవసాయం) రాజశేఖర్ ఉందు తెలిపారు. రాష్ట్రం వద్ద 24,500 ఎల్ఎంటి డిఎపి ఎరువు నిల్వ ఉన్నదని, దీంతో కొరత ఏమీ ఉండబోదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన చెప్పారు.

హర్యానాకు 60,000 మెట్రిక్ టన్నుల (ఎంటి) ఎన్‌పికె (నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాషియం) ఎరువు సరఫరా అయిందని అధికారులు తెలిపారు. ఇందులో 29,000 టన్నుల ఎన్‌పికెను ఇప్పటికే పంపిణీ చేశామని వివరించారు. హర్యానాలో అక్టోబర్ 1న రబీ సీజన్ అధికారికంగా ప్రారంభమైంది. 25 లక్షల హెక్టార్లలో గోధుమలు, 10 లక్షల హెక్టార్లలో చమురు గింజల పంటలు పండించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. చమురు గింజల పంటలు వేయడం ఇప్పటికే 80 శాతం పూర్తయిందని, గోధుమ పంటను కూడా వేగంగానే వేసుకుంటున్నారని అధికారులు వివరించారు. ఈ సీజన్‌లో ఆవాల పంట వేసిన రైతులు డిఎపి ఎరువు కోసం క్యూ కడుతున్నారు. సహకార సొసైటీల ఎదుట బారులు తీరుతున్న రైతన్నలను అదుపు చేసేందుకు అనేక ప్రాంతాలలో పోలీసులను రప్పించారు. ఇటీవల భివానీ జిల్లాలో ఒక చోట డిఎపి పంపిణీ కోసం పోలీస్ స్టేషనే కూపన్లు పంచింది. దేశవ్యాప్తంగా డిఎపి ఎరువు కొరత ఉన్నదంటూ వస్తున్న వార్తలతో రైతాంగం కలవరపడుతోంది.

రాష్ట్రంలో గోధుమ సీజన్ ఇప్పటికే ప్రారంభం కావడంతో యూరియా సరఫరా కోసం ప్రభుత్వం సన్నాహాలు మొదలు పెట్టింది. రాష్ట్రంలో 11 ఎల్ఎంటి యూరియా అవసరమవుతుంది. హర్యానాలోనే కాదు... దేశవ్యాప్తంగా యూరియాను రైతులు అధికంగా వినియోగిస్తుంటారు. 2009-10లో 26.7 మిలియన్ టన్నుల యూరియా అమ్మకాలు జరగగా, 2022-23లో అది 35.7 మిలియన్ టన్నులకు పెరిగింది. పంజాబ్, హర్యానా రాష్ట్రాల రైతులు యూరియాలో జింక్ సల్ఫేట్ కలిపి వరి పంటకు వేస్తుంటారు.

శ్రీనగర్ మార్కెట్ సమీపంలో గ్రెనేడ్ దాడి

- 12 మందికి గాయాలు

మార్కెట్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో టూరిస్ట్ రిసెప్షన్ సెంటర్ (టిఆర్‌సి) సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన గ్రెనేడ్ దాడిలో 12 మంది గాయపడ్డారు. సండే మార్కెట్ నిర్వహించే జనసమ్మర్ద ప్రదేశంలో ఈ ఘటన జరిగింది. టిఆర్‌సి సమీపంలో ఉన్న కేంద్ర రిజర్వ్ దళాల (సిఆర్‌పిఎఫ్) సిబ్బంది వైపు గ్రెనేడ్‌ను ఉగ్రవాదులు విసిరారని పోలీసులు తెలిపారు. అది లక్ష్యాన్ని చేరకుండా ఓ వీధి వ్యాపారి బండిని తాకింది. ఈ ఘటనలో గాయపడిన 12 మంది దుకాణదారులను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. జమ్ముకాశ్మీర్ పోలీసులు, పారామిలటరీ దళాలు వెంటనే ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి దుండగుల కోసం గాలింపు చేపట్టారు. గత సంవత్సర కాలంలో శ్రీనగర్‌లో గ్రెనేడ్ పేలుడు జరగడం ఇదే మొదటిసారి. శ్రీనగర్‌లోని ఖన్యార్ ప్రాంతంలో ఉస్మాన్ లష్కరీ అనే లష్కరే తోయిబా కమాండర్‌ను ఎన్‌కౌంటర్‌లో మట్టుపెట్టిన మరునాడే ఈ దాడి జరగడం గమనార్హం. శనివారం రోజంతా జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు భద్రతా సిబ్బంది గాయపడ్డారు.

దాడులను అడ్డుకునేందుకు కృషి చేయాలి : సిఎం ఒమర్ అబ్దుల్లా

గ్రెనేడ్ దాడి వార్త తనను తీవ్రంగా కలచివేసిందని జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఎక్స్‌లో పోస్టు చేశారు. అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఏవిధంగానూ సమర్థించలేమని, ప్రజలు ఎలాంటి భయం లేకుండా తమ జీవితాలను గడపడానికి భద్రతా దళాలు కృషి చేయాలని అబ్దుల్లా కోరారు.

ఉపసంహరణలో 'కొంత పురోగతి' : జైశంకర్

బ్రిస్బేన్ : బలగాల ఉపసంహరణలో భారత్-చైనా 'కొంత పురోగతి' సాధించాయని, దీనిని స్వాగతిస్తున్నామని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు. ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో భారత కమ్యూనిటీతో జరిగిన చర్చ సందర్భంగా మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. తూర్పు లడఖ్‌లోని డెమ్‌చోక్, డెస్పాంగ్ ప్లెయిన్స్ వద్ద భారత, చైనా దళాల ఉపసంహరణ పూర్తయిందని వార్తలు వచ్చిన కొన్ని రోజుల తరువాత మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. 'కొన్ని కారణాల వల్ల భారత్-చైనా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. అయితే ఉపసంహరణ విషయంలో మేం కొంత పురోగతి సాధించాం' అని మంత్రి ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ఉపసంహరణ తరువాత ఇరు దేశాల సంబంధాల్లో ఇతర మార్పులు కూడా జరిగే అవకాశం ఉందని మంత్రి చెప్పారు. గత నెలలో రష్యాలో ప్రధాని మోడీ, చైనా అధ్యక్షులు జిన్‌పింగ్ భేటీ అయిన విషయాన్ని గుర్తు చేస్తూ.. ఆ తరువాత ఇరు దేశాల విదేశాంగ మంత్రులు, జాతీయ భద్రతా సలహాదారులు కూడా భేటీ అవుతారని జైశంకర్ తెలిపారు.

ఇజ్రాయిల్‌కు బుద్ధి చెబుతాం

- ఎప్పుడు అనేది సైన్యం నిర్ణయిస్తుంది :ఇరాన్
- అదే జరిగితే ఇజ్రాయిల్‌ను ఆపలేం: అమెరికా

టెహ్రాన్: ఇజ్రాయిల్ ఇటీవల తమ దేశంపై జరిపిన దాడికి బుద్ధి చెప్పేందుకు ఇరాన్ సుప్రీం జాతీయ భద్రతా మండలి పథక రచన చేసింది. అయితే ఎదురు దాడి ఎప్పుడు చేపట్టేది మిలిటరీ ఉన్నతాధికారులు నిర్ణయిస్తారని ఇరాన్ రివల్యూషన్ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) మాజీ కమాండర్ , రక్షణ, భద్రత వ్యవహారాల పార్లమెంటరీ కమిటీ సభ్యుడు ఇస్మాయిల్ కోశారి చెప్పారు. ప్రతి దాడి ఎలా ఉండాలి అనే దానికి సంబంధించిన అన్ని వివరాలు మిలిటరీ నాయకులకు ఇచ్చాం. ఈ దాడులు ఎప్పుడు చేపట్టాలనేది వారే నిర్ణయిస్తారని ఆయన అన్నారు. 'యూదు దురహంకార ఇజ్రాయిల్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలనే విషయంలో ఇరాన్ సుప్రీం జాతీయ భద్రతా మండలి ఏకాభిప్రాయంతో ఉంది. ఇజ్రాయిల్ తాజా దురాగతానికి జవాబివ్వడం మా చట్టబద్ధమైన హక్కు. మేము దీనిని తప్పక ఉపయోగించుకుంటాం' అని కోశారి చెప్పారు. ఇరాకీ భూ భాగం నుంచి ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు గత శనివారం ఇరాన్‌లోని మిలిటరీ స్థావరాలపై జరిపిన దాడిలో నల్గురు ఇరాన్ సైనికులు చనిపోయారు. ఒక పౌరుడు కూడా గాయాలతో తరువాత చనిపోయాడు. హనియేను ఏప్రిల్‌లో ఇజ్రాయిల్ దాడి చేసి చంపినప్పటి నుంచి ఈ రెండు దేశాల మధ్య దాడులు, ప్రతి దాడులు గొలుసుకట్టుగా జరుగుతున్నాయి.

ఇరాన్ మళ్లీ దాడి చేస్తే ఇజ్రాయిల్‌ను ఆపడం కష్టం : అమెరికా బెదిరింపు

ఇరాన్ గనుక మళ్లీ దాడి చేస్తే ఇజ్రాయిల్‌ను ఆపడం కష్టమని, ఇది యుద్ధ విస్తరణకు దారి తీస్తుందని అమెరికా బెదిరించింది. ఇరాన్ మరోసారి దాడికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు ఇజ్రాయిల్ గూఢచారి వర్గాలు సూచించిన నేపథ్యంలో అమెరికా ఈ బెదిరింపులకు దిగింది. అమెరికా అధ్యక్ష ఎన్నికలలోపే ఇరాన్ దాడి చేయవచ్చని ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్‌ను ఉటంకిస్తూ యాక్సియోస్ వార్తా సంస్థ తెలిపింది.

జార్ఖండ్ సమరం

ఏడు కేజీల రేషన్, పెన్షన్ పెంపు

- హేమంత్ సొరేన్ హామీ

మాట్లాడుతున్న హేమంత్ సొరెన్

రాంచీ : రాష్ట్రంలో జెఎంఎం తిరిగి అధికారంలోకి వస్తే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రస్తుతం అందజేస్తున్న ఐదు కిలోల రేషన్‌ను ఏడు కిలోలకు పెంచుతామని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ హామీ ఇచ్చారు. రేషన్‌తో పాటు నెలసరి పెన్షన్‌ను కూడా పెంచుతామని ఆయన తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన ఆదివారం పోస్ట్ పెడుతూ రాష్ట్రంలో బిజెపి అధికారంలో ఉన్నప్పుడు 11 లక్షల రేషన్ కార్డులు, మూడు లక్షల పెన్షన్లను రద్దు చేసిందని గుర్తు చేశారు. ఫలితంగా అనేక మంది గిరిజనులు, దళితులు ఆకలికి తాళలేక ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. బిజెపి హయాంలో ఆకలి చావులు సర్వసాధారణమైతే తమ ప్రభుత్వంలో ప్రతి వ్యక్తీ రేషన్, పెన్షన్, పోషకాహారం పొందుతున్నాడని, అది తనకు గర్వకారణమని హేమంత్ తెలిపారు. సబ్సిడీపై ఆహారధాన్యాలు పొందలేకపోతున్న 10 లక్షల మందిని ప్రజా పంపిణీ వ్యవస్థలో చేరుస్తామని చెప్పారు. మయాన్ సమ్మాన్ యోజన కింద మహిళా లబ్దిదారులకు నెలకు రూ.2,500 ఇస్తామని, అంగన్‌వాడీ కేంద్రాలలో మధ్యాహ్న భోజనంలో చిన్నారులకు పండ్లు, గుడ్లు అందిస్తామని హేమంత్ హామీ ఇచ్చారు. జార్ఖండ్‌లో ఈ నెల 13, 20 తేదీలలో రెండు దశలుగా శాసనసభ ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. 23న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.

ప్రసంగిస్తున్న అమిత్‌షా

ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తాం

- జార్ఖండ్‌లో బిజెపి మేనిఫెస్టో విడుదల చేసిన అమిత్‌షా

రాంచీ : జార్ఖండ్‌లో అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి)ని అమలు చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. దాని పరిధిలో గిరిజనులను చేర్చబోమని ఆయన చెప్పారు. జార్ఖండ్ శాసనసభ ఎన్నికలకు సంబంధించి బిజెపి మ్యానిఫెస్టో 'సంకల్ప పత్ర'ను ఆదివారం రాజధాని రాంచీలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమలు, గనుల కారణంగా నిరాశ్రయులైన వారికి పునరావాసం కల్పించేందుకు కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జార్ఖండ్‌లో ఐదు లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, వాటిలో 2.87 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఉంటాయని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో పేపర్ లీకేజీలపై సిబిఐ, సిట్ దర్యాప్తు జరుపుతాయని, దోషులను శిక్షిస్తామని తెలిపారు. జార్ఖండ్‌లో చొరబాటుదారుల నుండి తిరిగి భూమిని స్వాధీనపరచుకునేందుకు బిజెపి ఓ చట్టాన్ని తీసుకొస్తుందని చెప్పారు. మ్యానిఫెస్టో విడుదల అనంతరం ఆయన మూడు ఎన్నికల ప్రచార సభలలో ప్రసంగించారు.

హిమంత ప్రసంగం విద్వేషపూరితం

- ఇసికి ఇండియా వేదిక ఫిర్యాదు

రాంచీ : బిజెపి జార్ఖండ్ ఎన్నికల ఇన్‌ఛార్జ్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఎన్నికల ప్రసంగాలు ప్రజల మధ్య విభజన సృష్టించే విధంగా ఉన్నాయని, అవి విద్వేషపూరితమని ఇండియా వేదిక నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌జెడి, సిపిఐ (ఎం), కాంగ్రెస్, జార్ఖండ్ ముక్తి మోర్చా (జెఎంఎం) పార్టీల నేతలు కేంద్ర ఎన్నికల సంఘానికి, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి లేఖలు రాశారు. ఈ నెల 1న సారత్‌లో జరిగిన బహిరంగ సభలో హిమంత ముస్లింలను లక్ష్యంగా చేసుకొని ప్రసంగించారని తెలిపారు. 'వారు ఒకే పార్టీకి ఓటేస్తారు. మనం ఇక్కడ సగం, అక్కడ సగం వేస్తాము' అని హిమంత తన ప్రసంగంలో ముస్లింలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎన్నికల కమిషన్‌కు రాసిన లేఖను ఇండియా కూటమి నేతలు విలేకరులకు విడుదల చేశారు. హిమంత తన ప్రసంగంలో 'చొరబాటుదారులు' వంటి విషపూరితమైన పదాలను ఉపయోగించడం ద్వారా విద్వేషాన్ని, అసమ్మతిని రెచ్చగొట్టారని వారు ఆ లేఖలో విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనారిటీ నేతలను లక్ష్యంగా చేసుకొని హిమంత ఓ ఇంటర్వ్యూ ఇచ్చారని కూడా తెలియజేశారు. రాబోయే 24 గంటలలో ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యలు చేపట్టకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని వారు హెచ్చరించారు.

ధుమ్ము, దూళితో ఢిల్లీల్లోని ప్రధాన రహదారి

ఢిల్లీలో ప్రమాదకరంగా కాలుష్యం

- డబ్ల్యుహెచ్ఒ సూచించిన పరిమితి కన్నా 65 రెట్లు అధికం

న్యూఢిల్లీ : ఢిల్లీలో వాయుకాలుష్యం ప్రమాదకర స్థాయికి పెరిగిపోయింది. దీపావళి తర్వాత కొద్ది రోజుల్లోనే ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) ఆమోదించిన పరిమితి కన్నా 65 రెట్లు అధికంగా ఇక్కడ వాయు కాలుష్యం ఉన్నట్లు నిపుణులు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఐదు గంటలకు ఢిల్లీలో వాయు నాణ్యతా ప్రమాణ సూచీ (ఎక్యూఐ) 500 పాయింట్లుగా నమోదై 'ప్రమాదకర' కేటగిరీకి చేరింది. ఢిల్లీతో పాటు అలీపూర్, ఆనంద్ విహార్, అశోక్ విహార్, బవానా, బురారీ, మధుర రోడ్, ఐజిఐ విమానాశ్రయం, ద్వారకా, జహంగీర్‌పురి సహా పలు ప్రాంతాల్లో ఎక్యూఐ 'చాలా పేలవం'గా నమోదైంది.

పొగమంచు ఢిల్లీని చుట్టుముట్టడంతో చాలా ప్రాంతాల్లో విజిబిలిటీ (దృశ్యమాన్యత) తగ్గిపోయిందని ఎక్యూఐసిఎన్ డేటా పేర్కొంది. ఢిల్లీ, ఎన్‌సిఆర్ పరిధిలో పిఎం 2.5 స్థాయిలు డబ్ల్యుహెచ్ఒ సూచించిన పరిమితి కంటే 50 రెట్లు ఎక్కువ ప్రమాదకరంగా మారినట్లు తెలిపింది.

ఢిల్లీతో పాటు ఎన్‌సిఆర్ పరిధిలో 69 శాతం మంది, ప్రతి కుటుంబంలో ఒకరు గొంతునొప్పి, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని సర్వే పేర్కొంది. 21,000 మందిపై ఈ సర్వే నిర్వహించారు. వాయు నాణ్యత తక్కువగా ఉండటం వలన 62 శాతం మంది కంటి సమస్యలను ఎదుర్కొంటున్నట్లు వెల్లడించింది.

ప్రధాని పదవి గౌరవాన్ని దిగజారుస్తున్నారు

- మోడీపై ప్రియాంక ఆగ్రహం

మహిళలతో మాట్లాడుతున్న ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ 140 కోట్ల మంది దేశ ప్రజలకు నిరంతరం కల్లబొల్లి హామీలు ఇస్తూ ప్రధాని పదవికి ఉన్న గౌరవాన్ని దిగజారుస్తున్నారని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ విమర్శించారు. కాంగ్రెస్ వాస్తవ దూరమైన హామీలు ఇస్తోందంటూ ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలపై ఆమె సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. 'సత్యమే దైవము అని మహాత్మా గాంధీజీ చెప్పేవారు. మండూక ఉపనిషత్తులో సత్యమేవ జయతే అని రాశారు. అదే మన జాతీయ నినాదం. ఈ నినాదమే సత్యాన్ని చాటిచెప్పింది. భారత స్వాతంత్రోద్యమానికి, దేశ పునర్నిర్మాణానికి, ప్రజా జీవనానికి ఆదర్శంగా మారింది' అని తెలిపారు. వేలాది సంవత్సరాల సంస్కృతికి సత్యమే ఆధారంగా ఉన్న దేశంలో అత్యున్నత పదవిలో కూర్చున్న వ్యక్తి అసత్యాలు చెప్పకూడదని ప్రియాంక చురక వేశారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు గ్యారంటీలు అమలు చేయడం ద్వారా హామీలు నెరవేర్చాయని తెలిపారు. వంద రోజుల ప్రణాళిక, ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు, వంద స్మార్ట్ సిటీలు, నల్ల ధనాన్ని వెనక్కి తేవడం, ద్రవ్యోల్బణాన్ని, నిరుద్యోగాన్ని తగ్గించడం, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, డాలర్‌కు సమానంగా రూపాయిని తీసుకురావడం, అచ్ఛేదిన్‌ను తేవడం వంటి హామీలిచ్చిన మోడీ... వాటిని ఎందుకు అమలు చేయలేదని ప్రియాంక ప్రశ్నించారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించడమే ప్రధాన పోరాటం : రాహుల్‌గాంధీ

రాజ్యాంగాన్ని పరిరక్షించడమే దేశంలో ప్రధాన పోరాటమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. సోదరి ప్రియాంకకు మద్దతుగా వయనాడ్‌లోని మనంతవడిలో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. తన తండ్రి రాజీవ్‌గాంధీ హత్య కేసులో దోషిగా తేలిన వ్యక్తిని ప్రియాంక కౌగలించుకున్నారని, నళినిని చూస్తే బాధేసిందని చెప్పిందని అన్నారు. ద్వేషంతోనో, కోపంతోనో రాజ్యాంగాన్ని రాయలేదని, బ్రిటీషు వారికి వ్యతిరేకంగా ఏళ్లపాటు జైళ్లలో గడిపిన వారు వినయంతో, ప్రేమతో రాజ్యాంగాన్ని రాశారని అన్నారు. అందువల్ల ప్రేమ, ఆప్యాయతతో కూడిన రాజకీయాలు అవసరమని చెప్పారు.

హౌరా మెయిల్‌లో పేలుడు

- నలుగురికి గాయాలు

చండీగఢ్: హౌరా మెయిల్ జనరల్ కోచ్‌లో పేలుడు సంభవించడంతో నలుగురు గాయపడిన సంఘటన పంజాబ్‌లోని ఫతేగఢ్ సాహిబ్ జిల్లాలో జరిగింది. హౌరా నుంచి అమృత్‌సర్ వెళుతున్న మెయిల్‌లో శనివారం రాత్రి 11 గంటలకు సిర్హింద్ రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఒక ప్లాస్టిక్ బకెట్‌లో ఉంచిన బాణాసంచా సామాగ్రితోనే ఈ ప్రమాదం సంభవించిందని ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పూర్తి విచారణ కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

డిజిటల్ అరెస్టు కేసులో ఇడి ఛార్జిషీట్

న్యూఢిల్లీ : డిజిటల్ అరెస్టులు అంటూ జరుగుతున్న నేరాలపై చర్యలు తీసుకోవడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కసరత్తు ప్రారంభించింది. ఇటువంటి నేరంతో నమోదైన ఒక కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసినట్లు ఒక ప్రకటనలో ఇడి పేర్కొంది. డిజిటల్ అరెస్టుతోపాటు నకిలీ యాప్‌లు, స్టాక్ మార్కెట్‌లో నకిలీ పెట్టుబడులతో సాధారణ ప్రజలను మోసం చేసిన ఎనిమిదిమంది నిందితులపై బెంగళూరులో ఉన్న పిఎంఎల్ఎ ప్రత్యేక కోర్టులో ఇడి ఛార్జిషీట్ నమోదు చేసింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల్లో ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపింది. లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులుగా నటిస్తూ డిజిటల్ అరెస్టు అంటూ మోసం చేసి వసూలు చేసిన నగదును వివిధ షెల్ కంపెనీలకు తరలిస్తున్నారని ఛార్జిషీట్‌లో ఇడి తెలిపింది. మరోవైపు డిజిటల్ అరెస్టుల పట్ల జాగ్రత్త వహించాలని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సి) ఆదివారం తాజాగా మరో పబ్లిక్ అడ్వైజరీని జారీ చేసింది. ఆదివారం చేసిన ఈ అడ్వైజరీలో 'వీడియో కాల్స్ చేస్తున్న వారు నిజమైన పోలీసు, సిబిఐ, కస్టమ్స్ అధికారులు కానీ, జడ్జీలు కానీ కాదు' అని తెలిపింది. వారు సైబర్ నేరస్థులు అని కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలోని ఐ4సి స్పష్టం చేసింది. ఇలాంటి మోసాల వలలో పడవద్దని, జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కి కాల్ చేసి ఇలాంటి నేరాలను వెంటనే తెలియపర్చాలని కోరింది.

ఇక ఉబర్ ఫ్లైట్స్

- వైమానిక అధికారుల కోసం ఒప్పందం
- ఐఎఎఫ్, ఊబర్ అగ్రిమెంట్ పున:పరిశీలించాలని భద్రతా నిపుణుల డిమాండ్

న్యూఢిల్లీ : భారత వైమానిక దళం (ఐఎఎఫ్), అమెరికాకు చెందిన యాప్ ఆధారిత క్యాబ్ సేవల సంస్థ ఉబర్ మధ్య కుదిరిన ఒప్పందంపై భద్రతా నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. క్యాబ్ సేవల కోసం ఉబర్‌తో భారత వైమానిక దళం ఓ ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం వైమానిక దళానికి చెందిన అధికారులు, వారి కుటుంబాలకు ఉబర్ సంస్థ ఎలాంటి ఆటంకాలు లేకుండా సేవలు అందించాల్సి ఉంటుంది.

అయితే ఈ ఒప్పందంపై భద్రతా నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం బయటికి పొక్కే అవకాశం ఉన్నదని, అధికారులు, వారి కుటుంబ సభ్యులు ఎక్కడ ఉన్నదీ తేలికగా కనిపెట్టవచ్చునని, వేరే యాప్‌లు కీలక సమాచారాన్ని పొంది దానిని ఇతరులకు అందజేసే ప్రమాదం ఉన్నదని వారు అనుమానాలు వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో ఉబర్‌తో కుదుర్చుకున్న అవగాహనా ఒప్పందం (ఎంఓయూ)పై పునఃపరిశీలన జరపాలంటూ రిటైర్డ్ సైనికాధికారి లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ థిల్లాన్ వైమానిక దళ నాయకత్వానికి సూచించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు.

మీకోసం

అల్లం, వెల్లుల్లి ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే కాగితంలో చుట్టి ఫ్రిజ్‌లో పెట్టాలి.

జీవన సౌరభం

మనిషి సాధించిన విజయాలు సమాజ అభివృద్ధికి ఉపయోగపడితే అవి నిజమైన విజయాలు.

గుణపాఠం

ఒక రోజు శ్రీకృష్ణదేవరాయలు అష్టదిగ్గజాలతో కొలువుతీరి ఉన్నాడు. పొరుగు రాజ్యం నుంచి వచ్చిన ఒక పండితుడు తనను తర్క, వ్యాకరణ, వేదాంత, సాహిత్య అంశాలలో చర్చకు దిగి ఓడిస్తే తాను జీవితకాలం తమ కొలువులో సేవ చేస్తానని, ఒకవేళ గెలుపొందినచో తనను, తన నిలువెత్తు బంగారంతో సత్కరించి పంపాలని సవాల్ విసిరాడు. అతడు అంత ధీమాగా చెప్పేసరికి సభలో కొలువైన అందరికీ భయం పట్టుకుంది. ఈ విషమ సమస్య నుంచి గట్టెక్కేలా చేయగలిగేది ఒక్క తెనాలి రామలింగడే అని భావించి శ్రీకృష్ణదేవరాయలు రామలింగని వైపు చూశాడు.

రామలింగడు వెంటనే ఆ వచ్చిన పండితునితో 'తప్పనిసరిగా మీరన్నట్లే మీరు గెలుపొందితే మీ నిలువెత్తు బంగారం ఇవ్వటానికి సిద్ధమే అయితే ఒక చిన్న షరతు. మీకొక తాడు ఇస్తాం. మీరు ఒక కొలనులోకి మీ ఛాతి మునిగేంత వరకు దిగి ఆ తాడు సహాయంతో దాన్ని తడపకుండా మీ నిలువెత్తు ఎత్తు ఎంతో చూపించాలి. దానికి సిద్ధమైతే మా పండితులు సిద్ధంగా ఉన్నారు మీతో చర్చించడానికి' అన్నాడు.

'అదెలా సాధ్యం?' అన్నాడు ఆ పండితుడు.

'సాధ్యమే' అన్నాడు రామలింగడు. 'ఎలా సాధ్యమో చెప్పండి?' అని అయోమయంగా అడిగాడు పండితుడు.

'మీ ఛాతీ మునిగేంతవరకు కొలనులో దిగిన తరువాత మీ రెండు చేతులను అడ్డంగా చాపి కుడిచేతి మధ్య వేలు కొననుంచి ఎడమచేతి మధ్య వేలు కొన వరకు తాడుని పట్టుకుని బయటకు తీసుకురండి. ఖచ్చితంగా అది మీ నిలువెత్తు ఎత్తు ఉంటుంది. చూసుకోండి' అని చెప్పేసరికి ఈ విషయం తనకు స్ఫురించకపోవటంతో సిగ్గుతో తలదించుకుని వెనుదిరిగాడు పండితుడు. ఆ తర్వాత ఆ పండితుడు ఇంకెప్పుడూ తన విద్వత్తు గురించి అహంకారంతో ప్రవర్తించలేదు.

- కొమ్ముల వెంకట సూర్యనారాయణ,
99496 02721.

లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన ఆకారాలను అంకెలుగా గణించి లెక్కచేశాం. చివరిలైను జవాబు మీరు రాబట్టండి.

జవాబు : 12



నేను గీసిన బొమ్మ

రామేశ్వరపు హాసిని,
6వ తరగతి,
ఎంపిపియుపి స్కూల్,
నడవపల్లి,
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

భయం, బిడియం వద్దే వద్దు

విమర్శ విజయానికి మొదటిమెట్టు. భయం, బిడియం ఆత్మవిశ్వాసానికి ప్రథమ శత్రువులు. ఏ పనైనా చేయాల్సి వచ్చినప్పుడు మనసులో తలెత్తే మొదటి ప్రశ్న : ఇది సాధ్యమేనా? అని. ముందు ఈ సాధ్యమేనా అన్న పదాన్ని ఆలోచనల్లోకి రానీయకూడదు. చాలామంది వాళ్ల శక్తి ఏమిటో వారికి తెలీక ఆందోళనకు లోనవుతూ ఉంటారు. తన బాస్, తన తోటి కొలీగ్స్‌ని మెప్పించాలనే ఆరాటంలో ఎదుటివారికి నచ్చే విధంగా తాము ఉండాలని తాపత్రయపడతారు. కానీ, ఎదుట వారికి నచ్చేట్లు మనం ఎందుకు ఉండాలి. మనకు నచ్చేటట్లు మన మనసు మెచ్చేట్టు ఉండాలి. నేను ఏ పనికీ తీసిపోననే భావన మనలో కలగాలి. మనకు నచ్చిన పని ఎంచుకోవాలి. మనం చేసే ప్రతి పనినీ చూసి ఎదుటివారు ఏమనుకుంటారో అనే గిల్టీ ఫీలింగ్‌ని దూరంగా నెట్టేయాలి. కొత్త ప్రాజెక్టులు మొదలు పెడితే ఇబ్బందులు వస్తాయని తెలిసినా, మన బలం ఏమిటో మనకు తెలుసు కాబట్టి నిస్సంకోచంగా ముందుకు దూసుకెళ్లిపోవచ్చు. ఏ విషయం మొదలు పెట్టినా మనకు దాని పట్ల పూర్తిగా అవగాహన ఉండేలా జాగ్రత్త పడాలి. ఇలాంటివి చేస్తూ పోతుంటే మనకు తెలియకుండానే మనలో ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. ఒకవేళ అన్నీ అనుకున్నట్లుగా అవకపోయినా... ఆ పని చేసే క్రమంలో కొత్త పాఠం నేర్చుకోగలిగాములే అన్న పాజిటివ్ థింకింగ్ పెంపొందించుకోవాలి. ఎదుటి వారి ప్రశంసను ఎంత ఆనందంగా స్వీకరిస్తామో విమర్శను కూడా చిరునవ్వుతో ఆహ్వానించాలి.

అలవాట్లలో మార్పులు అవసరం

మనిషికి తనపై తనకు నమ్మకం ఉండటం చాలా అవసరం. ఏ పనినైనా సమర్థవంతంగా చేయడానికి ఆత్మవిశ్వాసం అవసరం. అది వ్యక్తిత్వంలో నిండుగా ఉన్నప్పుడే కుటుంబంలోగానీ, పని ప్రదేశంలో గానీ ఓ గుర్తింపు ఉంటుంది. ప్రతిభ ఉండి ఆత్మవిశ్వాసం లేకపోతే ఏ రంగంలోనైనా సరిగ్గా రాణించలేరు. అందుకే ముందు మన మీద మనకి సరైన నమ్మకాన్ని ఏర్పరుచుకోవాలి. అందుకు మన నడవడికలో, అలవాట్లలో కొత్త మార్పు చేసుకుంటే సరిపోతుంది.

అవగాహన పెంచుకోవాలి

చదువులోగానీ, ఉద్యోగంలో గానీ ముందు చేసే పని పట్ల ఏకాగ్రత ముఖ్యం. అప్పగించిన పని పట్ల అవగాహన పెంచుకునేలా దృష్టి పెట్టాలి. పనిలో తెలియని విషయం ఏమైనా ఉంటే తోటి సహోద్యోగులను అడిగి తెలుసుకోవాలి. తెలియని విషయాన్ని తెలుసుకోవడానికి కొంతమంది బిడియపడతారు. ఇంకొంతమంది ఇతరుల దగ్గర తక్కువైపోతామనే అపోహతో ఉంటారు. ఈ రెండు ధోరణులు తప్పే. అందరికీ అన్నీ తెలియవు. ఆ పని చేస్తున్న క్రమంలో నేర్చుకుంటూ ముందుకు సాగాల్సిందే! ఆత్మవిశ్వాసం పెరగాలంటే తెలియని విషయాలను తెలుసుకోవాలన్న తపన, ఆతృత ఉండాలి.

సమయాన్ని వృథా చేయొద్దు

చెప్పిన సమయానికి పని అయ్యేట్లు ప్లానింగ్ చేసుకోవాలి. అడ్డంకులు, విమర్శలు ఎదురైతే– వాటిని సహనంతో దాటాలి. వాటి గురించే పదే పదే ఆలోచిస్తూ బాధపడుతూ కూర్చోకూడదు. సమయాన్ని వృథా చేయకూడదు. పాజిటివ్ థింకింగ్ అలవరుచుకోవాలి. రోజూ పది నిమిషాలు పాటు మనసుపెట్టి శ్వాసకు సంబంధించిన వ్యాయామాలు చేస్తూ ఉంటే ఏకాగ్రత పెరుగుతుంది. నెగిటివ్ ఆలోచనలు కూడా మెదడులోకి రావు.

అలసత్వం వద్దు

ఒకేసారి పెద్ద పనులు బాధ్యతగా తీసుకుని చేయడం కష్టమనిపిస్తుంది. అందుకే చిన్న చిన్న లక్ష్యాలు పెట్టుకుని నెల రోజులకు లేదా వారం రోజుల్లో ఆ పని పూర్తి చేయండి. చదువులోనూ ఇదే పద్ధతి పాటిస్తే మంచి ఫలితాలు సాధిస్తారు. సమయపాలన పాటిస్తూ వాటి పూర్తి చేసినప్పుడు మీకు మీ పని పట్ల ఒక అవగాహన వస్తుంది. చిన్న పనే కదా అని అలసత్వం పనికిరాదు. నిబద్ధతతో సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యాన్ని దాటే ప్రయత్నం చేయండి.

ఇంట్లోనైనా, ఆఫీసులోనైనా పనులను బాధ్యతగా చేయాలి. మెచ్చుకోలు కోసం ఎదురుచూస్తూ ఉంటే మరొక పని మీద దృష్టి పెట్టలేం. నలుగురితో కలవడం, మాట్లాడటం మంచిది. తెలియని విషయాలు తెలుస్తూ ఉంటాయి.

శారీరక, మానసిక ఆరోగ్యం

శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే మంచి ఆలోచనలు వస్తాయి. అందుకు మంచి ఆహారాన్ని తీసుకుంటూ ఉండాలి. లేదంటే తరచూ అనారోగ్యానికి గురవుతూ పని మీద శ్రద్ధ పెట్టలేరు. శరీరంలో తగినంత రక్తం శాతం లేకపోతే నిరాశ, నిరుత్సాహం కలుగుతాయి. నిరంతరం ఒత్తిడికి లోనయ్యి నెగిటివ్ ఆలోచనలు వస్తాయి. అందుకే పాలు, గుడ్లు, ఆకుకూరలు, అన్ని కూరగాయలు తింటూ ఉండాలి. రాగిజావ, బీట్‌రూట్, క్యారెట్, కీర జ్యూస్‌లు తాగాలి. మాంసం, డ్రైఫ్రూట్స్, వాల్ నట్స్ తింటే మెదడు చురుకుగా పని చేసి జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

అవసరార్థులకు ఉచిత సేవలు

కొంతమంది తమ పనులను తాము చేసుకోవటానికి కూడా బిడియ పడుతుంటారు. దీనినే సోషల్ యాంగ్జైటీ డిజార్డర్ అంటారు. ఇది కొంత వరకు మానసిక అస్వస్థతే. ఇలాఉంటే ముందు ముందు చాలా. పెద్ద సమస్యలు వస్తాయి. దీంతో పాటు మీకు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా ఉండొచ్చు. ఇలాంటి సమస్యలకు నీతోడు మానసిక వికాస కేంద్రం ద్వారా ఉచిత సేవలు అందిస్తున్నాం.

- జి.అనూష,
సైకాలజిస్ట్, విజయవాడ
94904 92020

చిన్నతనం నుంచే బీజాలు

ప్రతి మనిషికి వ్యక్తిగతంగా ఎన్నో ఇబ్బందులు ఉంటాయి. న్యూనతాభావం, సందిగ్ధత లాంటి సవాలక్ష సమస్యలు వేధిస్తూ ఉంటాయి. లోలోపల భయం, బిడియం, అవమానం వంటి వాటి మూలాలు చాలావరకు చిన్నతనంలోనే మొదలవుతాయి. వాటి గురించి ఎవరికి చెప్పుకోవాలో తెలియక తమలోనే దాచుకుంటున్నారు. దానివల్ల సమస్య పెరిగి పెద్దది అవుతుందే తప్ప పరిష్కారం దొరకదు.

- గోళ్ళమూడి శేఖర్ బాబు,
ప్రోగ్రాం మేనేజర్
నీతోడు మానసిక వికాస కేంద్రం,
81212 14386

వెండితెరకు దీపావళి కాంతులు

చాలా రోజుల తరువాత దీపావళికి వెండితెర కళకళలాడింది. ఈ పండుగకు వచ్చిన చాలా సినిమాలు ప్రేక్షకుల మన్ననలు పొందాయి. కొన్ని సినిమాలు బాక్సాఫీసు వద్ద వసూళ్లు కొల్లగొడుతున్నాయి. ఇందులో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన సినిమాల్లో 'అమరన్', 'లక్కీ భాస్కర్', 'క' ముందు వరుసలో ఉన్నాయి. వీటి తర్వాత కన్నడ మూవీ 'బఘీర' దూసుకుపోతోంది.

టాలీవుడ్ యంగ్‌హీరో కిరణ్ అబ్బవరం విభిన్నంగా 'క' టైటిల్‌లో దీపావళి రోజు ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. పీరియాడిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం భారీ బడ్జెట్‌తో తెరకెక్కింది. సుజీత్, సందీప్ దర్శకత్వం వహించారు. విభిన్న కథతో రావటంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగానే ఆదరించారు. 'సార్' సినిమాతో ధనుష్‌కు సూపర్‌హిట్ అందించిన దర్శకుడు వెంకీ అట్లూరి. ఆయన దర్శకత్వంలో వచ్చిన 'లక్కీ భాస్కర్' సినిమా కూడా ప్రేక్షకులను బాగానే ఆకట్టుకుంటోంది. సీతారామం సక్సెస్ తర్వాత పాన్ ఇండియా లెవల్లో దుల్కర్ సల్మాన్ నుంచి వచ్చిన డైరెక్ట్ తెలుగు మూవీ ఇది. 1980ల కాలంనాటి బొంబాయి (ముంబై) నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. దీపావళి సందర్భంగా దేశవ్యాప్తంగా విడుదలై మంచి ఫీడ్‌బ్యాక్‌ను అందుకుంది. ఒక బ్యాంగ్ ఉద్యోగిగా, మరోవైపు కుటుంబం కోసం ఎంతటి రిస్క్ అయినా చేసే ఫ్యామిలీ మ్యాన్‌గా దుల్కర్, అతని భార్యగా మీనాక్షి నటించారు. హవాలా కుంభకోణం చేసిన హర్షద్ మెహతా ఉదంతాన్ని ఈ సినిమా గుర్తు చేసింది. కార్పొరేట్ వ్యక్తులు, సంస్థలు ప్రభుత్వ ధనాన్ని ఎలా లూటీ చేస్తున్నారనేది ఇందులో చక్కగా చూపించారు.

తమిళ హీరో శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కిన సినిమా 'అమరన్'. మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ఈ సినిమాను దర్శకుడు రాజ్‌కుమార్ పెరియస్వామి తెరకెక్కించారు. తమిళ సూపర్‌స్టార్ కమల్‌హాసన్ నిర్మాత. లేడీ స్టార్ సాయిపల్లవి హీరోయిన్‌గా అద్భుత నటనను ప్రదర్శించారు. శివ కార్తికేయన్ కూడా మేజర్ వరదరాజన్ పాత్రలో జీవించారు. వరద రాజన్ ఇండియన్ ఆర్మీలోని రాజ్‌పుత్ రెజిమెంట్‌లోని అధికారి. దేశం కోసం అమరుడైన తర్వాత అశోకచక్ర పురస్కారం పొందారు. ఈ పాత్రలో శివకార్తికేయన్ జీవించాడనే చెప్పాలి. ఆయన భార్య ఇందు రెబెకా వర్గీస్ పాత్రలో సాయిపల్లవి మరింత వన్నె తెచ్చారు.

'ఉగ్రమ్' ఫేమ్ శ్రీ మురళీ హీరోగా నటించిన చిత్రం 'భఘీర'. 'కెజిఎఫ్' ఫేమ్ ప్రశాంత్‌నీల్ కథతో హోంబలే ఫిల్మ్ బ్యానర్‌పై ఈ సినిమా తెరకెక్కింది. సూరి దర్శకత్వం వహించిన ఈ సినిమా కన్నడలో రికార్డులను కొల్లగొడుతోంది. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో విడుదలైన ఈ సినిమాకు అన్ని చోట్ల మంచి ఆదరణే లభిస్తోంది. చిన్నప్పుడు తల్లి చనిపోయిన ఓ పిల్లాడు పెరిగి పెద్దయ్యాక పోలీస్ అవుతాడు. న్యాయం జరగటం లేదనీ, ముసుగు వేసుకుని 'బఘీర' గెటప్‌లో విలన్లను చంపుతుంటాడు. ఆ తర్వాత పోలీసులు పట్టుకుంటారు. డిఫరెంట్ గెటప్స్‌లో శ్రీ మురళీ ఆకట్టుకున్నాడు. ప్రశాంత్‌నీల్ స్టైయిల్‌లోనే యాక్షన్‌తోపాటు బ్లాక్ అండ్ వైట్ ఫ్రేమ్స్‌లోనే విజువల్స్ చాలా ఆకట్టుకున్నాయి.

ఇంకొన్ని సినిమాలు

సత్యదేవ్, కన్నడ స్టార్ డాలీ ధనుంజయ నటించిన 'జీబ్రా' సినిమా కూడా దీపావళికే విడుదలైంది. లక్ ఫేవర్స్ ది బ్రేవ్ అనేది ట్యాగ్ లైన్. ఈశ్వర్ కార్తీక్ ఈ సినిమాను తెరకెక్కించారు. నిజ జీవితంలో జరిగే సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఆర్థిక నేరాల నేపథ్యంలో క్రైమ్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఆద్యంతం సాగింది. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందించారు. సత్యరాజ్ కీలకపాత్రలోనూ, సునీల్, గరుడ రామచంద్రరాజు ఇతర పాత్రల్లో తమవంతుగా న్యాయం చేశారు. ఓల్డ్‌టౌన్ పిక్చర్‌పై బాలసుందరం, దినేష్ సుందరంగా సంయుక్తంగా నిర్మించారు.

బిగ్‌బాస్ తమిళ్ నుంచి బయటకు వచ్చాక వరుస హిట్లతో జోరుమీదున్న కెవిన్‌రాజ్ నిర్మించిన చిత్రం 'బ్లడీ బెగ్గర్'. కాళ్లూ చేతులు సరిగ్గా ఉన్నా, అడుక్కోవటానికి నాటకాలు ఆడే ముష్టివాడి పాత్రలో కెవిన్ నటించి ఆకట్టుకున్నారు. జయం రవి హీరోగా ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'బ్రదర్'. భూమిక, నటరాజ్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. గతంలో నేనే అంబానీ, ఆల్ ఇన్ ఆల్ అజగు రాజా, ఓకే.. ఓకే చిత్రాల ఫేమ్ ఎం.రాజేష్ దర్శకత్వంలో జయం రవి ఈ సినిమాలో నటించి మెప్పించారనే చెప్పొచ్చు. 'భూల్ భులయ్యా 3, సింగం ఎగైన్ వంటి హిందీ సినిమాలు కూడా శుక్రవారంనాడు విడుదలయ్యాయి. దసరాకు వెలవెలబోయిన టాలీవుడ్ బాక్సాఫీస్ ఈ దీపావళికి కొత్త సినిమాలు రాకతో కొంత పుంజుకుందనే చెప్పొచ్చు.

కివీస్ క్లీన్ స్వీప్

- సొంతగడ్డపై భారత్ ఘోర పరాజయం
- మూడో టెస్టులో 25 పరుగులతో కివీస్ గెలుపు
- ఛేదనలో రిషబ్ పంత్ పోరాటం వృథా
- 3-0తో టెస్టు సిరీస్ న్యూజిలాండ్ వశం

ముంబయి : వాంఖడెలో కీవిస్ స్పిన్ మాయకు టీమ్ ఇండియా విలవిల్లాడింది. న్యూజిలాండ్ స్పిన్నర్లు అజాజ్ పటేల్ (6/63), గ్లెన్ ఫిలిప్స్ (3/42) మ్యాజిక్ ముందు భారత బ్యాటర్లు మోకరిల్లారు. రెండో ఇన్నింగ్స్‌లో 147 పరుగుల సవాల్‌తో కూడిన ఛేదనలో రిషబ్ పంత్ (64, 57 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) మినహా మరో బ్యాటర్ రాణించలేదు. విరాట్ కోహ్లి (1), శుభ్‌మన్ గిల్ (1), సర్ఫరాజ్ ఖాన్ (1), యశస్వి జైస్వాల్ (5), రోహిత్ శర్మ (11), రవీంద్ర జడేజా (6) తేలిపోయారు. 29.1 ఓవర్లలో 121 పరుగులకే కుప్పకూలిన టీమ్ ఇండియా.. 25 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. బెంగళూర్, పుణె టెస్టుల్లోనూ ఓటమి చెందిన భారత్.. ముంబయిలో పరాజయంతో స్వదేశంలో తొలిసారి 0-3తో టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైంది. మ్యాచ్‌లో 11 వికెట్లు పడగొట్టిన అజాజ్ పటేల్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. 244 పరుగులతో నిలకడగా రాణించిన విల్ యంగ్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును దక్కించుకున్నాడు. 3-0తో టెస్టు సిరీస్ ట్రోఫీని న్యూజిలాండ్ కెప్టెన్ టామ్ లేథమ్ అందుకున్నాడు. ఆదివారం ముందుగా ఓవర్‌నైట్ స్కోరు 171/9తో మూడో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన న్యూజిలాండ్ ఎంతో సేపు నిలువలేదు. అజాజ్ పటేల్ (8, 23 బంతుల్లో 1 ఫోర్), విలియం ఓరౌర్క్ (2 నాటౌట్, 5 బంతుల్లో) స్కోరు బోర్డుకు మరో మూడు పరుగులే జోడించారు. రవీంద్ర జడేజా ఓవర్లో అజాజ్ పటేట్ క్యాచౌట్‌గా నిష్క్రమించగా.. 45.5 ఓవర్లలో న్యూజిలాండ్ 174 పరుగులకు ఆలౌటైంది. భారత స్పిన్నర్లు రవీంద్ర జడేజా (5/55) ఐదు వికెట్ల ప్రదర్శన చేయగా, రవిచంద్రన్ అశ్విన్ (3/63), వాషింగ్టన్ సుందర్(1/30), ఆకాశ్ దీప్ (1/10) రాణించారు. తొలి ఇన్నింగ్స్‌లోనూ ఐదు వికెట్లు పడగొట్టిన రవీంద్ర జడేజా.. ఓ టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ఐదేసి వికెట్లు తీయటం ఇదే తొలిసారి. ఈ పరాజయంతో భారత్‌కు 12 ఏళ్లుగా స్వదేశంలో ఎదురులేని సిరీస్ విజయాల జోరుకు బ్రేక్ పడగా.. సొంతగడ్డపై టెస్టు క్రికెట్ చరిత్ర ఎరుగని రీతిలో భారత్ వైట్‌వాష్ ఓటమిని మూటగట్టుకుంది. మూడు టెస్టుల సిరీస్‌లో స్వదేశంలో భారత్ అన్నింటా ఓటమి చవిచూడటం ఇదే ప్రథమం. భారత్‌లో కివీస్‌కు ఇది తొలి సిరీస్ విజయం.

యువ పంచ్‌కు 17 పతకాలు

- పార్థవి, గోస్వామి, హేమంత్‌లకు స్వర్ణాలు
- అండర్-19 ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్

కొలరాడో (యుఎస్ఏ) : అండర్-19 ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ షిప్స్‌లో యువ భారత్ అదరగొట్టింది. టీమ్ ఇండియా నుంచి పోటీల్లో 19 మంది బాక్సర్లు బరిలోకి దిగగా.. ఏకంగా 17 బాక్సర్లు పతకాలు కొల్లకొట్టారు. కృష్ణ వర్మ పసిడితో మెరువగా.. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో మరో ముగ్గురు బాక్సర్లు స్వర్ణాలు సాధించారు. మహిళల 65 కేజీల విభాగంలో పార్థవి గ్రెవల్, మహిళల 80 కేజీల విభాగంలో వెన్నిక గోస్వామి, మెన్స్ 90 కేజీల విభాగంలో హేమంత్ సంగ్వాన్‌లు పసిడి పంచ్ విసిరారు. మహిళల విభాగంలో నిష (51 కేజీలు), సుప్రియ దేవి (54 కేజీలు), క్రితిక వాసన్ (80 కేజీలు), చంచల్ చౌదరి (48 కేజీలు), అజంలి సింగ్ (57 కేజీలు), విని (60 కేజీలు), ఆకాంశ (70 కేజీలు) సిల్వర్ మెడల్స్ సాధించారు. మెన్స్ విభాగంలో రాహుల్ (75 కేజీలు) రతజంతో మెరువగా.. రిషి సింగ్ (50 కేజీలు), క్రిశ్ పాల్ (55 కేజీలు), సుమిత్ (70 కేజీలు), ఆర్యన్ (85 కేజీలు), లక్ష్యయ్ (90 కేజీలు) కాంస్య పతకాలు దక్కించుకున్నారు. వరల్డ్ బాక్సింగ్ నిర్వహించిన తొలి టోర్నమెంట్‌లో పతకాల పంట పండించిన భారత్ మహిళల విభాగంలో ఓవరాల్ రన్నరప్‌గా నిలిచింది.

ఆసీస్-ఎ అలవోకగా..!

- 7 వికెట్లతో తొలి టెస్టులో విజయం

మకాయ్ : భారత్-ఎ, ఆస్ట్రేలియా-ఎ తొలి అనధికార టెస్టులో ఆతిథ్య జట్టు అలవోక విజయం సాధించింది. 225 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్-ఎ 75 ఓవర్లలో మరో ఏడు వికెట్లు ఉండగానే ఛేదించింది. కెప్టెన్ నాథన్ మెక్‌స్వీనీ (88 నాటౌట్, 178 బంతుల్లో 9 ఫోర్లు), వెబ్‌స్టర్ (61 నాటౌట్, 117 బంతుల్లో 4 ఫోర్లు) అజేయ అర్థ సెంచరీలతో కదం తొక్కారు. 139/3 ఓవర్‌నైట్ స్కోరుతో ఛేదన మొదలెట్టిన ఆసీస్- ఏ.. నాల్గో రోజు ఆటలో ఒక్క వికెట్ కోల్పోలేదు. భారత-ఏ బౌలర్లలో ముకేశ్, ప్రసిద్, మానవ్‌లు తలా ఓ వికెట్ పడగొట్టారు. నితీశ్ కుమార్ రెడ్డి 9 ఓవర్లలో ఒక్క వికెట్ పడగొట్టలేదు. రెండు మ్యాచుల సిరీస్‌లో ఆసీస్-ఏ 1-0తో ఆధిక్యం సాధించింది. ఉదయం సెషన్లో ఆట ఆరంభమయ్యాక బంతి మార్చారనే కారణంతో అంపైర్‌తో వాగ్వాదానికి దిగిన వికెట్ కీపర్ ఇషాన్ కిషన్‌పై ఐసీసీ ఎటువంటి చర్యలు తీసుకోకుండా వదిలేసింది. ఇరు జట్ల కెప్టెన్ల అంగీకారంతో బంతి మార్చినా.. ఆ సంగతి తెలియని కిషన్ ఫీల్డ్ అంపైర్లతో గొడవ పడ్డాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68